తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక
జనంసాక్షి
www.janamsakshi.org
మెదక్ - మహబూబ్‌నగర్
సంగారెడ్డి | సిద్దిపేట
జోగులాంబ గద్వాల
వనపర్తి | నారాయణపేట
నాగర్ కర్నూల్
బుధవారం
30 సెప్టెంబర్ 2026

# పెద్ద శంకరంపేటలో పారిశుద్ధ్య సమస్యలు

## రోడ్డు పక్కనే చెత్త డంపింగ్.. చెరువులో చికెన్ వ్యర్థాలు

**పెద్ద శంకరంపేట, సెప్టెంబర్ 29 (జనంసాక్షి):** పెద్ద శంకరంపేట మండల కేంద్రంలో పారిశుద్ధ్య నిర్వహణపై ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గ్రామంలో సేకరించిన చెత్తను పంచాయతీ ట్రాక్టర్ ద్వారా ప్రధాన రహదారి పక్కనే డంప్ చేస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. దీంతో దుర్గంధం వెద జల్లడంతోపాటు వాహనదారులు, విద్యార్థులు, రైతులు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ఎండలకు చెత్త కుళ్లిపోవడం, వర్షాలకు రహదారిపైకి చెత్త కొట్టుకురావడంతో పరిస్థితి మరింత అధ్వానంగా మారుతోందని వాపోయారు.

**శాశ్వత డంపింగ్ యార్డ్ ఏర్పాటు చేయాలి...**

గ్రామ శివారులో జనావాసాలకు దూరంగా శాశ్వత డంపింగ్ యార్డ్ ఏర్పాటు చేసి చెత్తను అక్కడే తరలించాలని గ్రామస్తులు కోరుతున్నారు. పెద్ద మండల కేంద్రానికి ఇప్పటికీ సరైన డంపింగ్ యార్డ్ లేకపోవడం వల్లే రోడ్డు పక్కన చెత్త వేస్తున్నారని



ఆరోపిస్తున్నారు. గతంలో గుర్తించిన స్థలం పరిస్థితి ఏమిటి, కొత్త డంపింగ్ యార్డ్ ఏర్పాటుకు ప్రతిపాదనలు ఎందుకు చేయలేదని ప్రశ్నిస్తున్నారు.

**చెరువులో చికెన్ వ్యర్థాలు...**

మరోవైపు గ్రామ చెరువులో కొందరు చికెన్ సెంటర్ల నిర్వాహకులు కోళ్ల వ్యర్థాలు, ఈకలు, రక్తం తదితరాలను వేస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. దీంతో చెరువు నీరు కలుషితమై చేపలు మృత్యువాత పడుతున్నాయని, మత్స్యకారులు నష్టపోతున్నారని



చెబుతున్నారు. దోమల బెడద కూడా పెరుగుతోందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

**అధికారుల జోక్యానికి డిమాండ్...**

రోడ్డు పక్కన చెత్త డంపింగ్, చెరువులో వ్యర్థాల తరలింపుపై అధికారులు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. జిల్లా కలెక్టర్, జిల్లా పంచాయతీ అధికారులు స్పందించి గ్రామాన్ని పరిశీలించి, రహదారి పక్కన ఉన్న చెత్తను తొలగించడంతోపాటు శాశ్వత డంపింగ్ యార్డ్ ఏర్పాటు చేయాలని, చెరువు కాలుష్యాన్ని అరికట్టాలని డిమాండ్ చేస్తున్నారు.

# గిరిజనుల భూ సమస్యల పరిష్కారానికి కృషి

- **జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యుడు జాటోత్ హుసేన్**




**వనపర్తి బ్యూరో, సెప్టెంబర్ 29 (జనంసాక్షి):** గిరిజనులకు ఎదురయ్యే సమస్యల పరిష్కారానికి జాతీయ షెడ్యూల్డ్ తెగల కమిషన్ అండగా ఉంటుందని కమిషన్ సభ్యుడు జాటోత్ హుసేన్ తెలిపారు. మంగళవారం ఖిల్లా ఘనపురం మండలం ఎనికితాండాలో గిరిజనులతో సమావేశమై వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. మండలంలోని 27 తండాల పరిధిలో సుమారు 460 ఎకరాల రాజా భూములకు సంబంధించిన సమస్యను గిరిజనులు ఆయన దృష్టికి తీసుకువచ్చారు.

భూమిలేని నిరుపేదలకు న్యాయం చేయడానికే సీలింగ్ చట్టం ఉందని హుసేన్ పేర్కొన్నారు. ఏళ్లుగా భూములను సాగు చేసుకుంటున్న అర్హులైన పేదలకు హక్కులు కల్పిస్తే ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలు పొందే అవకాశం ఉంటుందని తెలిపారు. భూ సమస్యపై పరిశీలన జరిపి రెండు నెలల్లోగా పరిష్కార మార్గం చూపేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ప్రజావాణిలో గిరిజనులు సమర్పించే అర్జీలను అధికారులు సకాలంలో పరిశీలించాలని సూచించారు.

అట్రాసిటీ చట్టాన్ని దుర్వినియోగం చేయకుండా, నిజమైన అన్యాయాల సందర్భా


మిగతా 6లో..

ల్లోనే వినియోగించాలని తెలిపారు. చిన్న వివాదాలకే కేసులు నమోదు చేయడం వల్ల చట్టం ప్రాధాన్యం తగ్గకుండా చూడాలన్నారు. ప్రజాప్రతినిధులు గిరిజనుల సమస్యలను తెలుసుకునేందుకు సమయం కేటాయించాలని సూచించారు.

**తుల్జా భవాని ఆలయంలో పూజలు...**

అనంతరం కర్నెతాండాలోని తుల్జా భవాని ఆలయంలో హుసేన్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. అక్కడ నూతనంగా నిర్మించిన ప్రభుత్వ ఆస్పత్రిని కూడా పరిశీలించారు. ఆస్పత్రి ప్రారంభమైనప్పటికీ వైద్య సేవలు అందుబాటులోకి రాలేదని స్థానికులు ఆయనకు ఫిర్యాదు చేశారు. దీనిపై సంబంధిత అధికారులతో చర్చించి ఆస్పత్రిని ప్రజలకు అందుబాటులోకి తీసుకువచ్చేందుకు కృషి చేస్తానని తెలిపారు.

## డ్రగ్స్‌పై ఉక్కుపాదం






**గద్వాల నడిగడ్డ, సెప్టెంబర్ 29 (జనంసాక్షి):** డ్రగ్స్ మహమ్మారిని అరికట్టి యువత భవిష్యత్‌ను రక్షించడమే లక్ష్యంగా తెలంగాణ ఈగల్ ఫోర్స్ చర్యలను మరింత పటిష్టం చేయాలని అధికారులు సూచించారు. నషా ముక్త్ భారత్ దిశగా సమష్టి కార్యాచరణకు పిలుపునిచ్చారు. యాంటీ డ్రగ్ హెల్ప్‌లైన్ 1908పై ప్రజలకు విస్తృత అవగాహన కల్పించాలని పేర్కొన్నారు. జిల్లాలో నమోదైన డ్రగ్స్ కేసుల దర్యాప్తు, యాంటీ డ్రగ్ స్క్వాడ్ల పనితీరుపై ప్రత్యేక సమీక్ష నిర్వహించి, లోపాలను సరిదిద్దాలని సూచించారు. డ్రగ్స్ విక్రయాలు, వినియోగంపై నిఘా పెంచడంతో పాటు విద్యార్థులు, యువతకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని తెలిపారు. డ్రగ్స్ నిర్మూలనకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని పిలుపునిచ్చారు.

## కలెక్టర్ ప్రతిక్ జైన్ ప్రత్యేక చొరవ

- నీట్ లో..ఉచిత కోచింగ్ కై స్క్రీనింగ్ టెస్ట్
- మండలంలో 109 గురు నీట్ పరీక్ష వ్రాసిన విద్యార్థులు
- హద్నూర్ పరీక్షా కేంద్రాన్ని పరిశీలించిన కలెక్టర్, ఆర్డిఓ


మిగతా 5లో..

**న్యాల్‌కల్, సెప్టెంబర్ 29 (జనంసాక్షి):** జిల్లాలో ప్రభుత్వ విద్యాసంస్థల్లో విద్యనభ్యసిస్తున్న విద్యార్థులు.. నీట్‌లో మెరుగైన ప్రతిభను చాటి ప్రభుత్వ ఉద్యోగాల సాధనే లక్ష్యంగా కలెక్టర్ ప్రతిక్ జైన్ ప్రత్యేక చొరవ చూపారు. మంగళవారం జిల్లా వ్యాప్తంగా జరిగిన.."నీట్ స్క్రీనింగ్ టెస్ట్" (అర్హత నిర్ధారణ) పరీక్షలో భాగంగా.. బుధవారం మధ్యాహ్నం 12:15 గంటల నుండి 1గంట (45 నిమిషాలు) వరకు న్యాల్ కల్ మండలంలో.. న్యాల్ కల్ ప్రభుత్వ జూనియర్ కళాశాల, కస్తూర్బా గాంధీ గురుకుల పాఠశాల, హద్నూర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులు నీట్ స్క్రీనింగ్ టెస్ట్ (అర్హత నిర్ధారణ) పరీక్ష కొనసాగింది.

## ఎమ్మెల్సీ పట్టభద్రుల
# ఇంచార్జీగా లక్ష్మికాంత్ రెడ్డి



**మక్తల్, సెప్టెంబర్ 29 (జనంసాక్షి):** గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో మక్తల్ నియోజకవర్గ ఇంచార్జీగా బంగ్ల లక్ష్మికాంత్ రెడ్డిని ఎంపీ డీకే అరుణ నియమించారు. సహ ఇంచార్జీలుగా కర్ని స్వామి, జిందే జ్యోతి శ్రీనివాస్, జయానంద్ రెడ్డిని నియమించారు.

నియోజకవర్గంలోని ఏడు మండలాల్లో అర్హులైన పట్టభద్రులను గుర్తించి వంద శాతం ఓటరు నమోదు చేయాలని డీకే అరుణ సూచించారు. పార్టీ శ్రేణులు సమన్వయంతో పనిచేసి ఎన్నికల విజయానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. లక్ష్మికాంత్ రెడ్డి మాట్లాడుతూ ఓటరు నమోదే తమ ప్రధాన లక్ష్యమన్నారు.

# ఎస్సీ, ఎస్టీల హక్కుల పరిరక్షణకు కృషి

- **ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య**

**సిద్దిపేట బ్యూరో, సెప్టెంబర్ 29 (జనంసాక్షి):** రాష్ట్రంలో ఎస్సీ, ఎస్టీల హక్కుల పరిరక్షణకు కమిషన్ కృషి చేసిందని రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య తెలిపారు. మంగళవారం సిద్దిపేట ఐడీఓసీ సమావేశ మందిరంలో ల్యాండ్ అట్రాసిటీస్, రోస్టర్ పాయింట్ల అమలు, బ్యాక్‌లాగ్ ఖాళీలపై అధికారులతో సమావేశం నిర్వహించారు.

అక్టోబర్ 4తో తమ పదవీకాలం ముగుస్తుందని, కమిషన్ చట్ట పరిధిలో దళితులు, గిరిజనుల హక్కుల కోసం పనిచేశామని వెంకటయ్య తెలిపారు. ఎస్సీ, ఎస్టీలకు న్యాయం జరిగేలా అధికారులు బాధ్యతతో వ్యవహరించాలని సూచించారు. ప్రజలకు, ముఖ్యంగా దళితులు, గిరిజనులకు స్నేహపూర్వకంగా సేవలందించాలని కోరారు. ప్రతి నెల చివరి వారంలో సివిల్ రైట్స్ డే నిర్వహించి చట్టాలు, సంక్షేమ పథకాలపై అవగాహన కల్పించాలని ఆదేశించారు. ప్రతి మూడు నెలలకు జిల్లా విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సమావేశం నిర్వహించాలని, ఉద్యోగ నియామకాల్లో రోస్టర్ విధానం పాటించాలని సూచించారు.


మిగతా 10లో..



# గుండె ఆరోగ్యం పై అవగాహన కోసం భారీ సైకిల్ ర్యాలీ..

- టీజీఐఐసీ మాజీ చైర్మన్ నిర్మల జగ్గారెడ్డి







**సదాశివపేట, సెప్టెంబర్ 29 (జనంసాక్షి):** గుండె ఆరోగ్యం పై ప్రజల్లో అవగాహన పెంచడంతో పాటు ఆరోగ్యకరమైన జీవన విధానాన్ని ప్రోత్సహించే లక్ష్యంతో సంగారెడ్డి బాలాజీ ఆసుపత్రి వారి ఆధ్వర్యంలో సదాశివపేట పట్టణంలో భారీ సైకిల్ ర్యాలీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా టీజీఐఐసీ మాజీ చైర్మన్ నిర్మల జగ్గారెడ్డి హాజరై జెండా ఊపి సైకిల్ ర్యాలీని ప్రారంభించారు. ఈ సందర్భంగా నిర్మల జగ్గారెడ్డి మాట్లాడుతూ ఆరోగ్యమే మహాభాగ్యం... గుండెను కాపాడుకుంటే జీవితాన్ని కాపాడుకున్నట్టే అనే సందేశం తో బాలాజీ హాస్పిటల్ వారు నిర్వహించిన సైకిల్ ర్యాలీ అభినందనీయమని అన్నారు. రోజువారి జీవితంలో నడక, వ్యాయామం వంటి శరీరాక శ్రమను భాగం చేసుకోవడం,సమతుల ఆహారం తీసుకోవడం, ఆరోగ్యంపై ముందస్తు జాగ్రత్తలు పాటించడం వంటి అంశాలపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. అనంతరం ఎస్పీ పరితోష్ పంకజ్ బాలాజీ హాస్పిటల్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరాన్ని పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ముఖ్యంగా యువతకు ఆరోగ్యం, నడక, వ్యాయామం ప్రాధాన్యత పై అవగాహన కల్పించేందుకు ఇలాంటి కార్యక్రమాలు ఉపయోగపడతాయని అన్నారు. ప్రస్తుతం మారుతున్న జీవనశైలి, శారీరక శ్రమ తగ్గిపోవడం, అధిక ఒత్తిడి, సమయపాలన లేని ఆహారపు అలవాట్ల కారణంగా ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ అవసరం అవుతుందని తెలిపారు. ప్రతిరోజు కొంత సమయం నడకకు కేటాయించడం, తగిన వ్యాయామం చేయడం, సమతుల ఆహారం తీసుకోవడం, అవసరమైనప్పుడు వైద్యం కారణాలు ఆరోగ్య పరీక్షలు వంటి అలవాట్లను ప్రతిఒక్కరూ పాటించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో తోపాజి అనంత కిషన్, మున్సిపల్ చైర్మన్ మునిపల్లి అంజమ్మ సత్యనారాయణ, వైస్ చైర్మన్ రేణుక చిరంజీవి, మున్సిపల్ కమిషనర్ శివాజీ, సీఐ వెంకటేష్, బాలాజీ హాస్పిటల్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ శ్రీధర్, మున్సిపల్ కౌన్సిలర్‌లు, పట్లూరి నాగరాజు గౌడ్, బాలాజీ హాస్పిటల్ వైద్యులు,కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.



## ఎస్‌జిఎఫ్‌యూ - 19 వాలీబాల్ విజేత దౌల్తాబాద్ టీమ్



**కోహెడ, సెప్టెంబర్ 29 (జనంసాక్షి):** ఎస్‌జిఎఫ్‌యూ –19 వాలీబాల్ పోటీ విజేతగా దౌల్తాబాద్ టీమ్ నిలిచింది. కోహెడ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నిర్వహించిన జిల్లా స్థాయి వాలీబాల్ పోటీలలో దౌల్తాబాద్ జట్టు విజేతగా నిలిచింది. అలాగే సిద్దిపేట ప్రభుత్వ కళాశాల ద్వితీయ స్థానం సంపాదించింది. జిల్లాస్థాయి వాలీబాల్ పోటీలు 24 జట్లు పాల్గొనగా దౌల్తాబాద్ జట్టు విజేతగా నిలిచింది. విజేతగా నిలిచిన జట్టుకు జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి కలకొండ రవీందర్ రెడ్డి బహుమతులు అందజేసి అభినందనలు తెలియజేశారు.
ఈ కార్యక్రమంలో ఎస్ జి ఎఫ్ ఆర్గనైజింగ్ సెక్రటరీ ఎం సమ్మయ్య, కళాశాల అధ్యాపకులు కోతి యాదగిరి, వడ్డెపల్లి రాజమౌళి ,రాజేశ్వర్ రెడ్డి, కె.అశోక్, వి.నరేష్, ఎ.సితారామయ్య, వి,వెంకట్ రెడ్డి, యస్ శ్రీనివాస్, కె.రజిత, యం.నిరజ, యు శ్రీనివాస్, సుజాత, చిరంజీవి, వివిధ కళాశాల పీడీలు, క్రీడాకారులు విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు.

## దివ్యాంగుల పట్ల సమాజంలో గౌరవంగా ఉండాలి

- సంగారెడ్డిలో ప్రపంచ చెవిటితన దినోత్సవం
- దివ్యాంగుల హక్కులు, ఉచిత న్యాయ సేవలపై అవగాహన
- సీనియర్ సివిల్ జడ్జి బి. సౌజన్య




**సంగారెడ్డి బ్యూరో, సెప్టెంబర్ 29 (జనంసాక్షి):**
దివ్యాంగుల పట్ల సమాజంలో గౌరవంగా ఉండాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి బి. సౌజన్య పేర్కొన్నారు.
ప్రపంచ చెవిటితన దినోత్సవాన్ని పురస్కరించుకొని సంగారెడ్డి జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో న్యాయ అవగాహన కార్యక్రమం నిర్వహించారు.
ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి బి. సౌజన్య దివ్యాంగుల హక్కులు, ఉచిత న్యాయ సహాయం, ప్రభుత్వ సంక్షేమ పథకాలపై అవగాహన కల్పించారు.
వినికిడి లోపం ఉన్న చిన్నారులు సహా దివ్యాంగులు తమ హక్కులను తెలుసుకోవాలని, అవసరమైనప్పుడు జిల్లా న్యాయ సేవాధికార సంస్థను సంప్రదించి ఉచిత న్యాయ సహాయం పొందవచ్చని తెలిపారు. దివ్యాంగుల పట్ల సమాజంలో సమానత్వం, గౌరవం, సహానుభూతి కలిగి ఉండాలని సూచించారు.
కార్యక్రమంలో ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్ మురళీకృష్ణ, ఆర్ఎంఓ రవికుమార్, ఈఎన్‌టీ విభాగాధిపతి, వైద్యులు, సిబ్బంది, వినికిడి లోపం ఉన్న చిన్నారులు పాల్గొన్నారు. వారికి అందుబాటులో ఉన్న న్యాయ, వైద్య, సంక్షేమ సేవలపై అవగాహన కల్పించారు.

## అంగన్వాడీలపై పోషణ మాసంలో అవగాహన



**బెజ్జంకి, సెప్టెంబర్ 29 (జనంసాక్షి):** పోషణ్ అభియాన్‌లో భాగంగా బెజ్జంకి సెక్టార్ స్థాయిలో పోషణ మాసం కార్యక్రమం నిర్వహించారు. 'హమారే అంగన్వాడీ–హమారే జిమ్మేదారీ' నినాదంతో చేపట్టిన కార్యక్రమంలో గర్భిణీలు, బాలింతలు, చిన్నారులు పోషకాహారం తీసుకోవాలని ఐసీడీఎస్ అధికారి భావన సూచించారు. స్థానికంగా లభించే పదార్థాలతో సమతుల ఆహారం తీసుకోవాలని, అంగన్వాడీ సేవలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. సర్పంచ్ బొల్లం శ్రీధర్ మాట్లాడుతూ చిన్నారుల ఎదుగుదలకు అంగన్వాడీలు దోహదపడతాయన్నారు. రెండో ఆడపిల్ల జన్మించిన కుటుంబాలకు సంరక్షణ కిట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో అధికారులు, సిబ్బంది, ఆశా, అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

## బస్సు సౌకర్యం మెరుగుపరచాలని వినతి



**కౌడిపల్లి, సెప్టెంబర్ 29 (జనంసాక్షి):** కూకుట్లపల్లి గ్రామానికి బస్సు సౌకర్యం మెరుగుపరచాలని కోరుతూ గ్రామస్తులు నర్సాపూర్ బస్ డిపో డీఎంను కలిసి వినతి పత్రం అందజేశారు. గ్రామం నుంచి నర్సాపూర్, పరిసర ప్రాంతాలకు విద్యార్థులు, ఉద్యోగులు, రైతులు, వ్యాపారులు, మహిళలు, వృద్ధులు నిత్యం ప్రయాణిస్తుంటారని తెలిపారు. సరైన సమయాల్లో బస్సులు లేక ప్రైవేట్ వాహనాలను ఆశ్రయించాల్సి వస్తోందని, అదనపు ఖర్చులు భరించాల్సి వస్తోందన్నారు. ముఖ్యంగా ఉదయం, సాయంత్రం వేళల్లో అదనపు బస్సులు నడపాలని, ప్రస్తుతం ఉన్న సర్వీసులను పెంచాలని కోరారు. నర్సాపూర్‌తో పాటు ఇతర ప్రాంతాలకు అనుకూలంగా బస్సు సమయాలను నిర్ణయించాలని విజ్ఞప్తి చేశారు. గ్రామస్తుల వినతిపై డీఎం సానుకూలంగా స్పందించి, సమస్యను పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు తెలిపారు.

## నిస్వార్థ సేవకుడి మృతి బాధాకరం

- జహీరాబాద్ ఎమ్మెల్యే కే.మాణిక్ రావు



**న్యాల్‌కల్, సెప్టెంబర్ 29 (జనంసాక్షి):** టీఆర్ఎస్, బీఆర్ఎస్ ఆవిర్భావం నుంచి పార్టీ అభ్యున్నతికి నిస్వార్థంగా సేవలందించిన మఠం బసయ్య స్వామి (73) మృతి బాధాకరమని జహీరాబాద్ ఎమ్మెల్యే కే.మాణిక్‌రావు అన్నారు. మంగళవారం పార్టీ నాయకులతో కలిసి బసయ్య స్వామి కుటుంబాన్ని పరామర్శించి సానుభూతి తెలిపారు. ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు నరసింహారెడ్డి, నాగిశెట్టి, సింగీతం సిద్దన్న, ప్రవీణ్ కుమార్, రవికుమార్, మారుతి, ఖాదర్‌సాబ్, చాల్కి అశోక్, విట్టల్‌రెడ్డి, ఉమేష్ తదితరులు పాల్గొన్నారు.

## సిద్ధి వినాయకుని దర్శించుకున్న శివకుమార్ దంపతులు



**న్యాల్‌కల్, సెప్టెంబర్ 29 (జనంసాక్షి):** అంగారక చతుర్థి సందర్భంగా రేజింతల్ స్వయంభూ శ్రీ సిద్ధి వినాయకుడిని డీసీఎంఎస్ మాజీ చైర్మన్ మల్కాపూర్ శివకుమార్, మంజుల దంపతులు దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. బీఆర్ఎస్ నాయకులతో కలిసి ఆలయానికి వచ్చిన వారికి వేద పండితులు స్వాగతం పలికి సత్కరించారు. పర్వదినం సందర్భంగా బీదర్, హుమ్నాబాద్, జహీరాబాద్, నారాయణఖేడ్, ఆందోల్ తదితర ప్రాంతాల నుంచి వేలాది మంది భక్తులు తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్ అల్లాడి నర్సింలు, వైద్యనాథ్, ప్రవీణ్‌కుమార్, రాజేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## గట్టు ప్రమీల మృతి బాధాకరం



**శివ్వంపేట, సెప్టెంబర్ 29 (జనంసాక్షి):** మున్నూరు కాపు మహిళా పరస్పర సహాయ సహకార సంఘం రాష్ట్ర వైస్ చైర్‌పర్సన్ కల్లూరి కీర్తన తల్లి గట్టు ప్రమీల మృతి బాధాకరమని మున్నూరు కాపు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పుట్టం పురుషోత్తమరావు అన్నారు. మంగళవారం యాదాద్రి భువనగిరి జిల్లా తుర్కపల్లి మండలం మాదాపురంలోని వారి నివాసానికి వెళ్లి కీర్తన కుటుంబాన్ని పరామర్శించి ధైర్యం చెప్పారు. ప్రమీల చిత్రపటానికి నివాళులర్పించి, ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు. కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు హన్మంత్‌రావు, మాజీ ఎంపీపీ కల్లూరి హరికృష్ణ, గట్టు నిఖిల్, డాక్టర్ చందనారావు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా పోషణ మాసం - ఈసీసీఈ డే



**చేర్యాల, సెప్టెంబర్ 29 (జనంసాక్షి):** వేచరేణి గ్రామంలో పోషణ మాసం, ఈసీసీఈ డే కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు. చిన్నారుల ఆరోగ్యం, పోషకాహారం, పరిశుభ్రత, బాలల సంరక్షణ, ప్రాథమిక విద్యపై అవగాహన కల్పించారు. గర్భిణీలకు శ్రీమంతం, చిన్నారులకు అన్నప్రాశన, అక్షరాభ్యాసం నిర్వహించారు. పోషకాహారం, ప్రారంభ బాల్య విద్యతోనే పిల్లల సమగ్ర అభివృద్ధి సాధ్యమని ఎంఈఓ బైర నరేందర్ తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ వెంకటలక్ష్మి, ఉపసర్పంచ్ నవీన్, సీడీపీఓ రమాదేవి, వైద్యులు, అంగన్‌వాడీ సిబ్బంది, ఏఎన్‌ఎంలు, ఆశా కార్యకర్తలు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## సీఎం దిష్టిబొమ్మ దహనం



**బెజ్జంకి, సెప్టెంబర్ 29 (జనంసాక్షి):** హిందూ దేవుళ్లపై సీఎం రేవంత్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలను నిరసిస్తూ బీజేపీ ఆధ్వర్యంలో అంబేద్కర్ కూడలి వద్ద సీఎం దిష్టిబొమ్మను దహనం చేశారు. బీజేపీ మండల అధ్యక్షుడు కొలిపాక రాజు మాట్లాడుతూ సీఎం వ్యాఖ్యలు హిందువుల మనోభావాలను దెబ్బతీసేలా ఉన్నాయని అన్నారు. బీజేపీ కిసాన్ మోర్చా రాష్ట్ర కార్యదర్శి కరివేద మహిపాల్‌రెడ్డి, రాష్ట్ర నాయకుడు సొల్లు అజయ్‌వర్మ మాట్లాడుతూ వ్యాఖ్యలను ఖండించారు. సీఎం వెంటనే బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు సంగా రవి, దొమ్మతి రాములు, సాన వేణు, నర్సింగం, బుర్ర కిషన్, నేతి మహేష్ తదితరులు పాల్గొన్నారు.

### సిరిసిల్ల సభకు

## కాంగ్రెస్ శ్రేణులు తరలిరావాలి

**కోహెడ, సెప్టెంబర్ 29 (జనంసాక్షి):** సిరిసిల్లలో సీఎం రేవంత్‌రెడ్డి పాల్గొనే పాదయాత్ర, బహిరంగ సభకు కాంగ్రెస్ శ్రేణులు అధిక సంఖ్యలో తరలిరావాలని మండల కాంగ్రెస్ అధ్యక్షుడు శెట్టి సుధాకర్ పిలుపునిచ్చారు. అంబేద్కర్ విగ్రహం నుంచి సీఎం పాదయాత్ర నిర్వహించి సభలో ప్రసంగించనున్నారని తెలిపారు. ప్రభుత్వం అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇళ్లు, గృహజ్యోతి, రైతుభరోసా, ఉచిత బస్సు, కళ్యాణలక్ష్మి, షాదీముబారక్ తదితర సంక్షేమ పథకాలను వివరించారు. చేనేత, పవర్‌లూమ్ రంగాల సమస్యలు, నేతన్నల బకాయిల పరిష్కారంపై ప్రభుత్వం దృష్టి సారిస్తోందన్నారు. సభను విజయవంతం చేసేందుకు సమన్వయంతో పనిచేయాలని కోరారు.

## పటాన్చెరులో ఘనంగా ప్రారంభమైన ఎస్‌జిఎఫ్ మండలస్థాయి పోటీలు..

- క్రీడలు, క్రీడాకారులకు సంపూర్ణ సహకారం
- ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి





**పటాన్చెరు, సెప్టెంబర్ 29(జనంసాక్షి):** విద్యార్థి దశ నుండి క్రీడలపై ఆసక్తి పెంపొందించేలా సహకారం అందిస్తే భవిష్యత్తులో జాతీయ, అంతర్జాతీయ క్రీడలకు ప్రాతినిధ్యం వహించే అవకాశాలు లభిస్తాయని పటాన్చెరు శాసన సభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు.

మంగళవారం పటాన్చెరు డివిజన్ పరిధిలోని మైత్రి మైదానంలో ఏర్పాటు చేసిన 70వ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ పటాన్చెరువు మండల స్థాయి క్రీడోత్సవాలను.. ఎమ్మెల్యే జీఎంఆర్ ముఖ్యఅతిథిగా హాజరై లాంచనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. పటాన్చెరు నియోజకవర్గాన్ని క్రీడలకు కేంద్రంగా తీర్చిదిద్దుతున్నామని తెలిపారు. విద్యార్థులకు క్రీడలపై ఆసక్తి పెంపొందించేలా నిరంతరం ఉచిత శిక్షణ, క్రీడా పోటీలు నిర్వహిస్తున్నామని తెలిపారు. రాబోయే రోజుల్లో జాతీయస్థాయి పోటీలకు సైతం ఆతిథ్యం అందించబోతున్నట్లు తెలిపారు.

మూడు రోజులపాటు జరగనున్న క్రీడోత్సవాలకు సంపూర్ణ సహకారం అందిస్తూ అన్ని వసతులు ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

ఈ కార్యక్రమంలో ఎస్ జి ఎఫ్ జిల్లా కార్యదర్శి శ్రీనివాస్, మాజీ కార్పొరేటర్ మెట్టు కుమార్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ పాండు, కాటా విజయ్ కుమార్, సీనియర్ నాయకులు నర్ర భిక్షపతి, కుమార్ గౌడ్, శివారెడ్డి, వెంకటేష్, అశోక్, శంకర్, రాజు, రాజన్ సింగ్, వివిధ పాఠశాల క్రీడాకారులు, వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## ఫామ్ పాండ్ పనులకు భూమి పూజ



**కల్హేర్, సెప్టెంబర్ 28 (జనంసాక్షి):** కల్హేర్ మండలం కృష్ణాపూర్‌లో ఉపాధి హామీ పథకం కింద మంజూరైన ఫామ్ పాండ్ పనులకు భూమి పూజ చేశారు. రైతు మల్లారెడ్డి సావిత్రి, కృష్ణయ్య పొలంలో రూ.1.16 లక్షల అంచనా వ్యయంతో 12x12 మీటర్ల విస్తీర్ణం, 3 మీటర్ల లోతుతో పాండ్ నిర్మించనున్నారు. మల్లారెడ్డి తుకారం ఆధ్వర్యంలో పనులు ప్రారంభమయ్యాయి. వర్షపు నీటిని ఒడిసిపట్టి భూగర్భ జలాలను పెంచేందుకు ఫామ్ పాండ్లు ఉపయోగపడతాయని ఆయన తెలిపారు. కార్యక్రమంలో ఏపీఓ గురుపాదం, ఉప సర్పంచ్ దస్తప్ప రమేష్, పంచాయతీ సెక్రటరీ రమేష్, కాంగ్రెస్ నాయకులు, రైతులు, కూలీలు పాల్గొన్నారు.

## నానో ఎరువులపై రైతులకు అవగాహన





**నంగునూర్, సెప్టెంబర్ 29 (జనంసాక్షి):** నంగునూర్ మండలం వెంకటాపూర్ రైతు వేదికలో నానో యూరియా, నానో డీఏపీ వినియోగంపై రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. రసాయన ఎరువుల వినియోగాన్ని తగ్గించి నానో ఎరువులు వాడితే పంట దిగుబడి పెరగడంతోపాటు నేల, నీరు, గాలి కాలుష్యం తగ్గుతుందని అధికారులు వివరించారు. రైతులకు సాయిల్ హెల్త్ కార్డులు అందజేశారు. నానో యూరియాను లీటరు నీటికి 4 మి.లీ. చొప్పున పిలకలు లేదా పూత దశలో పిచికారీ చేయాలని సూచించారు. నానో డీఏపీని విత్తన శుద్ధికి కిలోకు 5 మి.లీ., పిచికారీకి లీటరు నీటికి 4 మి.లీ. వాడాలని తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ సంతోష్‌రెడ్డి, ఉప సర్పంచ్ కవిత, ఏడీఏ పద్మ, ఎంఏఓ గీత, ఇఫ్కో ట్రైనర్ అక్బర్, ఏఈఓ మౌనిక తదితరులు పాల్గొన్నారు.

## మెదక్‌కు త్వరలో కొత్త డెడ్‌బాడీ ఫ్రీజర్లు.. వైకుంఠ రథాలు

### రూ.70 లక్షలతో మంజూరు.. ఎమ్మెల్యే సహకారంతో సమస్యకు పరిష్కారం



**మెదక్, సెప్టెంబర్ 29 (జనంసాక్షి):** మెదక్ పట్టణంలో డెడ్‌బాడీ ఫ్రీజర్ల కొరతకు త్వరలో పరిష్కారం లభించనుంది. పట్టణ ప్రజలకు అవసరమైన సమయంలో ఇబ్బందులు తలెత్తకుండా రెండు కొత్త డెడ్‌బాడీ ఫ్రీజర్లు, రెండు వైకుంఠ రథాలు అందుబాటులోకి తీసుకురానున్నట్లు మున్సిపల్ చైర్‌పర్సన్ కాసుగు రాధిక భూపతిరాజు తెలిపారు.

డెడ్‌బాడీ ఫ్రీజర్ల కొరతపై ఇటీవల ప్రతిపక్షంలో వచ్చిన కథనంపై ఆమె స్పందించారు. ప్రస్తుతం మున్సిపాలిటీ పరిధిలో రెండు ఫ్రీజర్లు ఉండగా, అందులో ఒకటి పనిచేయడం లేదని, మరో ఫ్రీజర్ మున్సిపల్ కార్యాలయ ప్రాంగణంలో ఉన్నట్లు తెలిపారు. ప్రజలకు అవసరమైన సమయంలో ఫ్రీజర్లు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు.

స్థానిక ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ సహకారంతో కొత్తగా రెండు డెడ్‌బాడీ ఫ్రీజర్లు, రెండు వైకుంఠ రథాలను సమకూర్చేందుకు రూ.70 లక్షల నిధులు మంజూరైనట్లు చైర్‌పర్సన్ వెల్లడించారు. దీంతో పట్టణ ప్రజలకు ఈ సేవలు మరింత అందుబాటులోకి వస్తాయని పేర్కొన్నారు.

**ఫ్రీజర్ల పరిరక్షణకు షెడ్**

ప్రస్తుతం మున్సిపల్ కార్యాలయం వెలుపల ఉంచుతున్న డెడ్‌బాడీ ఫ్రీజర్ల రక్షణ కోసం మున్సిపల్ ప్రాంగణంలో ప్రత్యేక షెడ్ నిర్మించనున్నట్లు రాధిక భూపతిరాజు తెలిపారు. షెడ్ నిర్మాణం పూర్తయిన అనంతరం ఫ్రీజర్లను సురక్షితంగా భద్రపరిచే అవకాశం ఉంటుందని అన్నారు.

ఫ్రీజర్లను మున్సిపల్ కార్యాలయం నుంచి తీసుకెళ్లే సమయంలో ఎలాంటి జాగ్రత్తలు పాటిస్తారో, తిరిగి అప్పగించే సమయంలో కూడా అదే విధంగా జాగ్రత్తలు తీసుకోవాలని ప్రజలకు సూచించారు. సక్రమంగా వినియోగిస్తే ఫ్రీజర్లు ఎక్కువకాలం పనిచేసే అవకాశం ఉంటుందని తెలిపారు.

**దాతలకు ప్రత్యేక అవకాశం**

ప్రజా అవసరాల దృష్ట్యా ఎవరైనా దాతలు డెడ్‌బాడీ ఫ్రీజర్‌ను విరాళంగా అందజేస్తే, వారి పేరుతో మున్సిపల్ ప్రాంగణంలో ఏర్పాటు చేసి ప్రజలకు అందుబాటులో ఉంచుతామని చైర్‌పర్సన్ తెలిపారు. ప్రజలకు అత్యవసరంగా అవసరమయ్యే ఈ సేవలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా శాశ్వత పరిష్కారం దిశగా చర్యలు కొనసాగుతున్నాయని ఆమె పేర్కొన్నారు.

## వృద్ధాశ్రమంలో బీజేపీ ఓబీసీ సేవా కార్యక్రమాలు



**పెద్ద శంకరంపేట్, సెప్టెంబర్ 29 (జనంసాక్షి):** ప్రధాని నరేంద్ర మోదీ జన్మదినోత్సవం సందర్భంగా సెప్టెంబర్ 17 నుంచి అక్టోబర్ 17 వరకు నిర్వహిస్తున్న సేవా సంకల్ప అభియాన్‌లో భాగంగా బీజేపీ ఓబీసీ ఆధ్వర్యంలో వృద్ధాశ్రమంలో సేవా కార్యక్రమాలు నిర్వహించారు.

సంగారెడ్డి జిల్లా బీజేపీ ఓబీసీ అధ్యక్షుడు కోణం విఠల్ ఆధ్వర్యంలో గుమ్మడిదల మండలం అన్నారం సేవా ఆశ్రమంలోని వృద్ధులకు మధ్యాహ్న భోజనం, పండ్లు అందజేసి, శాలువాలతో సన్మానించారు. ఈ సందర్భంగా మోదీ నాయకత్వంలో దేశం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతోందని నాయకులు పేర్కొన్నారు.

కార్యక్రమంలో జిల్లా బీజేపీ అధ్యక్షురాలు గోదావరి అంజిరెడ్డి, జిల్లా ఇన్‌చార్జి రమన్ సింగ్, ప్రధాన కార్యదర్శి రాజశేఖర్‌రెడ్డి, అశోక్‌కుమార్, శ్రీనివాస్, మల్లేశం తదితరులు పాల్గొన్నారు.

## 10 నెలల పసికందుకు అరుదైన ఆపరేషన్




- తండ్రి మూల కణాలతో చిన్నారికి పునర్జన్మ
- విజయవంతంగా నిర్వహించిన యశోద ఆస్పత్రి వైద్యులు

**మహబూబ్ నగర్ అర్బన్, సెప్టెంబర్ 29 (జనంసాక్షి):** వారసత్వంగా వచ్చే 'అమెగాకార్యోసైటిక్ థ్రోంబోసైటోపెనియా' అనే అరుదైన ఎముక మజ్జ వైఫల్యంతో బాధపడుతున్న 10 నెలల వయసున్న బాబుకు యశోద ఆస్పత్రి వైద్యులు అత్యాధునిక 'హాప్లోయిడెంటికల్ స్టెమ్ సెల్' మార్పిడి చేసి కొత్త జీవితాన్ని అందించారు. విలేక రుల సమావేశంలో బోన్ మ్యారో ట్రాన్స్ ప్లాంట్ స్పెషలిస్ట్ డా. విక్రమ్ కుమార్ కేసు వివరాలను వెల్లడించారు. ఏపీలోని కర్నూలు జిల్లా నందవరం గ్రామానికి చెందిన ముల్ల ఖాజా, రేష్మల చిన్నారి ఎం.ఖాదర్ అర్మాన్ (10 నెలలు) ప్లేట్‌లెట్స్ కౌంట్ తక్కువగా ఉండటాన్ని గుర్తించారు. గతేడాది డిసెం బర్ 26 సోమాజిగూడ యశోద ఆస్పత్రికి తీసుకొ చ్చారు. సమగ్ర క్లినికల్ పరీక్షల అనంతరం అమె గాకార్యోసైటిక్ థ్రోంబోసైటోపెనియా ఉన్నట్లు చికిత్స పూర్తిచేసుకున్న చిన్నారితో వైద్య బృందం నిర్ధారణ అయింది. ఇది తీవ్రమైన థ్రోంబోసైటోపె నియా, రక్తస్రావం, ప్రమాదంతో కూడిన అరుదైన వారసత్వంగా వచ్చే ఎముక మజ్జ వైఫల్య రుగ్మతగా గుర్తించాం. తండ్రి మూల కణాలను ఉపయోగించి హాప్లోయిడెంటికల్ స్టెమ్ సెల్ ట్రాన్స్ ప్లాంటేషన్ జనవరి 8న విజయవంతంగా నిర్వహించాం. బాబు వైద్యపరంగా స్థిరంగా ఉన్నాడని నిర్ధారించు కున్న తరువాత డిశ్చార్జ్ చేశామని ఆయన వివరించారు.

## తండ్రికి తలకొరివి పెట్టిన పదహారేళ్ల కూతురు!

- నిరుపేద కుటుంబానికి దాతలు అండగా నిలవాలని నాయి బ్రాహ్మణ సంఘం విజ్ఞప్తి





**నంగునూరు, సెప్టెంబర్ 29 (జనంసాక్షి):** తండ్రి ఆకస్మిక మృతితో పదో తరగతి చదువుతున్న 16 ఏళ్ల బాలిక తండ్రికి తలకొరివి పెట్టిన విషాద ఘటన నంగునూరు మండలం రాజగోపాలపేటలో చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన రాచకొండ మంగలి మహేశ్ (బైక్ మెకానిక్) మంగళవారం రాత్రి గుండెపోటుతో మృతి చెందారు. భార్య అనుజ, ఏకైక కుమార్తె కళ్యాణితో కలిసి సిద్దిపేటలో నివాసముంటున్న ఆయన మరణంతో కుటుంబం పెద్ద దిక్కును కోల్పోయింది.

ఇందిరానగర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతున్న కళ్యాణి తండ్రి మృతదేహం వద్ద కన్నీరుమున్నీరైంది. సంప్రదాయం ప్రకారం తండ్రికి తలకొరివి పెట్టి అంత్యక్రియలు నిర్వహించింది. నిరుపేద కుటుంబం కావడంతో మహేశ్ మృతితో భార్య, కుమార్తె ఆర్థిక ఇబ్బందుల్లో పడ్డారు. కళ్యాణి చదువు కొనసాగేందుకు దాతలు ఆర్థికంగా అండగా నిలవాలని సిద్దిపేట జిల్లా నాయి బ్రాహ్మణ సంఘం అధ్యక్షుడు కొత్వాల్ యాద నరేందర్ విజ్ఞప్తి చేశారు. సహాయం చేయదలచిన వారు 8008808943, 9949245610 నంబర్లకు ఫోన్‌పే లేదా గూగుల్‌పే ద్వారా సాయం అందించాలని కోరారు.

# జీరో యాక్సిడెంట్ జోన్గా మెదక్‌ను తీర్చిదిద్దాలి : జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్




• **డ్రగ్స్ రహిత సమాజమే మనందరి లక్ష్యం**

**మెదక్ బ్యూరో, సెప్టెంబర్ 29 (జనంసాక్షి):** జీరో యాక్సిడెంట్ జోన్‌గా మెదక్ ను తీర్చిదిద్దుతూ జిల్లాలో మాదకద్రవ్యాలు నియంత్రణపై పట్టు బిగించాలని జిల్లా కలెక్టర్ ప్రతిమసింగ్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో రోడ్డు ప్రమాదాల నివారణ మాదకద్రవ్యాల నిర్మూలనపై అదనపు ఎస్పీ విక్రాంత్ సింగ్ , జిల్లా అధికారులతో కలిసి అధికారులతో సమీక్షించారు.

**ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ...**

జీరో యాక్సిడెంట్ జోన్ గా మెదక్ ను తీర్చిదిద్దాలని, మాదకద్రవ్యాల నిర్మూలనకు పటిష్ట చర్యలు తీసుకోవాలని అధికారులకు దిశా నిర్దేశం చేశారు. రోడ్డు భద్రత మరియు మాదకద్రవ్యాల నిరోధం అనేవి సమాజ రక్షణలో అత్యంత కీలకమైన అంశాలు. అని అన్నారు. గత సమావేశంలో చర్చించిన అంశాలపై ఆర్ అండ్ బి నేషనల్ హైవే సమన్వయంతో చేపట్టిన అంశాలపై అడిగి తెలుసుకున్నారు. బ్లాక్ స్పాట్స్ (ప్రమాదాలు ఎక్కువగా జరిగే ప్రాంతాలు) గుర్తించడం, సైన్ బోర్డుల ఏర్పాటు, మరియు స్పీడ్ బ్రేకర్ల నిర్మాణం వంటి పటిష్ట చర్యలు తీసుకోవాలని అన్నారు హెల్మెట్ లేకపోవడం, డ్రంక్ అండ్ డ్రైవ్, రాంగ్ రూట్ డ్రైవింగ్, మరియు మైనర్ డ్రైవింగ్‌లపై కఠినమైన జరిమానాలు విధించాలన్నారు. మాదక ద్రవ్యాల రవాణా, విక్రయాల నిర్మూలన కోసం మేరకు ఈ సమన్వయ సమావేశాలు ద్వారా ముందుకు పోవాలన్నారు. పాఠశాలలు, కళాశాలల సమీపంలో గంజాయి, డ్రగ్స్ అమ్మకాలపై కఠిన చర్యలు తీసుకోవడం మరియు విద్యార్థుల రక్షణ కోసం విద్యాసంస్థల్లో యాంటీ డ్రగ్ కమిటీల ద్వారా ప్రణాళిక అబద్ధమైన చర్యలు తీసుకుంటున్నామన్నారు. రోడ్డు, మార్గాల ద్వారా జిల్లాలోకి వచ్చే మాదకద్రవ్యాల రవాణాను అరికట్టేందుకు ఎక్సైజ్ మరియు పోలీస్ శాఖలు సంయుక్తంగా ప్రత్యేక నిఘా ఉంచుతున్నాయి. అదనపు ఎస్పి విక్రాంత్ కుమార్ సింగ్ మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాల నివారణకు విస్తృత తనిఖీలు నిర్వహిస్తున్నామని, మాదకద్రవ్యాలు వినియోగించడం చట్టరీత్యా నేరమని తనిఖీలు ద్వారా చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఈ కార్యక్రమంలో జడ్పీ సీఈఓ ఎల్లయ్య, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి గణేశ్వర్, పోలీస్, రవాణా, ఇతర శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# కార్యకర్తలే పార్టీకి బలం.. కాపాడుకోవడమే లక్ష్యం

• **జహీరాబాద్ ఎమ్మెల్యే కే.మాణిక్ రావ్**



**న్యాల్‌కల్, సెప్టెంబర్ 29 (జనంసాక్షి):** అధికారం, విపక్షంలో ఉన్న.. కార్యకర్తలను కాపాడుకోవడమే లక్ష్యమని, పార్టీ అభివృద్ధికి కార్యకర్తలే ఎంతో కీలకమని జహీరాబాద్ ఎమ్మెల్యే కే.మాణిక్ రావు అన్నారు.

ఈ నెల 19న మండలంలోని చాల్కి గ్రామంలో అధికార, విపక్ష పార్టీ శ్రేణుల మధ్య జరిగిన ఘర్షణ వాతావరణ నేపథ్యంలో.. బాధిత కుటుంబాలను పరామర్శించారు. గ్రామానికి చెందిన బీఆర్ఎస్ నాయకులు గొల్ల విట్టల్ దంపతులు, గొల్ల అశోక్ దంపతులకు.. అధికార పార్టీకి చెందిన కొందరు వ్యక్తుల మధ్య జరిగిన ఘర్షణ నేపథ్యంలో.. స్థానిక పోలీసులు పూర్తిస్థాయిలో విచారణ చేపట్టకుండా ఏకపక్షంగా నిర్ణయాలు తీసుకొని కేసులు నమోదు చేయడం ఎంత మాత్రం సరికాదని బాధిత కుటుంబీకులకు భరోసా కల్పించారు. ఈ మేరకు స్థానిక పోలీసులు నిష్పక్షపాతంగా విచారణ చేపట్టాలని పోలీసులకు ఎమ్మెల్యే సూచించారు. జరిగిన సంఘటన వివరాలను బాధితులతో అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో పార్టీ శ్రేణులు నరసింహారెడ్డి, రవికుమార్, అశోక్, కైరాత్ పాటిల్, అంజి, దత్తు, సిద్దయ్య స్వామి, శ్రీనివాస్ రెడ్డి తదితరులు ఉన్నారు.

## బాధిత కుటుంబాలను

# పరామర్శించిన ఒగ్గు దామోదర్



**బెజ్జంకి, సెప్టెంబర్ 29 (జనంసాక్షి):** మండలంలోని వివిధ గ్రామాల్లో ఇటీవల మృతిచెందిన వారి కుటుంబాలను ఫ్యాక్స్ చైర్మన్ ఒగ్గు దామోదర్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు లింగాల శ్రీనివాస్ పరామర్శించారు. బెజ్జంకికి చెందిన తిప్పారపు సురేష్, గుండారం బోడపట్ల మల్లయ్య, దాచారం మంద ఎల్లవ్వ కుటుంబాలతో పాటు అరెపల్లి ఉప సర్పంచ్ విజయ తండ్రి భూమిరెడ్డి కుటుంబాన్ని పరామర్శించి సానుభూతి తెలిపారు. కాంగ్రెస్ పార్టీ బాధిత కుటుంబాలకు అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, సహకార సంఘం డైరెక్టర్లు, గ్రామ శాఖ అధ్యక్షులు తదితరులు పాల్గొన్నారు.

# టీడబ్ల్యూజేఎఫ్ నూతన కార్యవర్గానికి సన్మానం



**నారాయణఖేడ్, సెప్టెంబర్ 29 (జనంసాక్షి):** తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ (టీడబ్ల్యూజేఎఫ్) నారాయణఖేడ్ నియోజకవర్గ నూతన కార్యవర్గాన్ని తెలంగాణ రక్షణ సేన నియోజకవర్గ ఇన్‌చార్జి బాపు మలిశెట్టి మంగళవారం శాలువాలు, పుష్పగుచ్ఛాలతో ఘనంగా సన్మానించారు. అధ్యక్షుడిగా పుట్టి సంజీవ్‌కుమార్, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా బిరదర్ ప్రతాప్, ప్రధాన కార్యదర్శిగా కైసర్, కోశాధికారిగా ఇబ్రహీం ఖాన్, ఉపాధ్యక్షులుగా సిద్ధిరాం, నాగిశెట్టి శరణప్ప, ఆంజనేయులు తదితరులను అభినందించారు. ఈ సందర్భంగా బాపు మలిశెట్టి మాట్లాడుతూ నూతన కార్యవర్గం ప్రజా సమస్యల పరిష్కారంతో పాటు జర్నలిస్టుల సమస్యలు, హక్కులు, సంక్షేమంపై దృష్టి సారించాలని కోరారు. జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి సంఘటితంగా కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో టీఆర్ఎస్ నాయకులు మాణిక్యం తదితరులు పాల్గొన్నారు.

# జిల్లా వాలీబాల్ జట్టుకు విద్యార్థి ఎంపిక



**ఊరుకొండ, సెప్టెంబర్ 29 (జనంసాక్షి):** నాగర్‌కర్నూల్ జిల్లా అండర్-17 వాలీబాల్ జట్టుకు శ్రీ వేంకట బాల్ రామయ్య ఐఐటీ, జేఈఈ, నీట్ అకాడమీ విద్యార్థి వినయ్ ఎంపికయ్యాడు. ఈ సందర్భంగా విద్యాసంస్థల చైర్మన్ సామల తిరుపతయ్య విద్యార్థిని సన్మానించి అభినందించారు. మరింత ఉన్నతంగా రాణించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో కరస్పాండెంట్ సామల బాల్‌రాజు, ప్రిన్సిపల్ కృష్ణారావు, వైస్ ప్రిన్సిపల్ రామ్ పెరుమాండ్ల, పీఈటీ భీమాంజనేయులు, లెక్చరర్లు పాల్గొన్నారు. విద్యార్థి ఎంపికకు కృషి చేసిన పీఈటీ భీమాంజనేయులును అభినందించారు.

# పాలమూరు యూనివర్సిటీ విద్యార్థులకు హాస్టల్ వసతి కల్పించాలి

• **లా స్టూడెంట్స్ ఫోరం**



**మహబూబ్‌నగర్, సెప్టెంబర్ 29 (జనంసాక్షి):** పాలమూరు యూనివర్సిటీలో లా, ఇంజనీరింగ్ విద్యార్థులకు తక్షణమే హాస్టల్ వసతి కల్పించాలని లా స్టూడెంట్స్ ఫోరం ఆధ్వర్యంలో విద్యార్థులు వీసీ జి.ఎన్. శ్రీనివాస్‌కు వినతిపత్రం అందజేశారు. యూనివర్సిటీలో సీట్లు పొందినప్పటికీ హాస్టల్ వసతి లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని తెలిపారు. ప్రైవేట్ హాస్టళ్లలో ఉండే ఆర్థిక స్తోమత లేకపోవడంతో ప్రతిరోజూ సుదూర ప్రాంతాల నుంచి రాకపోకలు సాగిస్తూ ఇబ్బందులు పడుతున్నామని వీసీ దృష్టికి తీసుకెళ్లారు.

పేద, బడుగు, బలహీన వర్గాలకు చెందిన విద్యార్థులు అధికంగా ఉన్నందున చదువుకు ఆటంకం కలగకుండా వెంటనే హాస్టల్ సౌకర్యం కల్పించాలని కోరారు. హాస్టల్ భవనాల నిర్మాణం పూర్తయిన తర్వాతే వసతి కల్పిస్తామని అధికారులు చెప్పడంపై విద్యార్థులు అసంతృప్తి వ్యక్తం చేశారు. ప్రత్యామ్నాయంగా యూనివర్సిటీలో ఖాళీగా ఉన్న 12 గదులను తక్షణమే వినియోగంలోకి తీసుకురావాలని, సమీపంలోని ఖాళీ భవనాన్ని కూడా విద్యార్థుల కోసం ఉపయోగించాలని డిమాండ్ చేశారు. వారం రోజుల్లో సమస్య పరిష్కరించకపోతే ఆమరణ నిరాహార దీక్షకు సిద్ధమవుతామని లా స్టూడెంట్స్ ఫోరం నాయకులు హెచ్చరించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్వీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, పాలమూరు యూనివర్సిటీ ఇన్‌చార్జి సుదీప్‌రెడ్డి, విద్యార్థి జేఏసీ నాయకులు సాయి, స్వేరోస్ అధ్యక్షుడు పవన్‌తో పాటు విద్యార్థులు పాల్గొన్నారు.

# రికవరీలో ప్రథమం... బాధితుల హర్షం




**పాపన్నపేట, సెప్టెంబర్ 29 (జనంసాక్షి):** చరవాణిలు రికవరీ చేసి బాధితులకు అప్పగించడంలో పాపన్నపేట ఠాణా పోలీసులు జిల్లాలో ప్రథమ స్థానం నిలిచారని ఎస్ఐ శ్రీనివాస్ గౌడ్ తెలిపారు. కొంత కాలంగా వివిధ ప్రాంతాల్లో పోగొట్టుకున్న చరవాణి లకు బాధితులు మీసేవ ద్వారా ఫిర్యాదు చేశారు. ఎస్ఐ ఆధ్వర్యంలో ఇప్పటి వరకు 601 చరవాణిలు పోలీసులు గుర్తించగా అందులో 589 చరవాణిలు 98 శాతం రికవరీ చేశారు. మంగళవారం మరో 12 బాధితులకు అందించారు. ఇది వరకు పెద్ద ఎత్తున ఫోన్లు రికవరీ చేసి మెదక్ డిఎస్పీ ప్రసన్నకుమార్ చేతుల మీదుగా అందజేశారు. దీంతో బాధితులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

# పరిసరాల పరిశుభ్రత ముఖ్యం

• **సర్పంచ్ ఆర్ వెంకటేశ్వర్**



**శివ్వంపేట, సెప్టెంబర్ 29 (జనంసాక్షి):** గ్రామంలో ఎల్లప్పుడూ పరిసరాల పరిశుభ్రతకు ప్రజలందరూ సహకరించాలని శివ్వంపేట సర్పంచ్ రాజీపేట వెంకటేశ్వర్, ఉప సర్పంచ్ ఇసుగారి మల్లేష్ లు పిలుపునిచ్చారు. మండల కేంద్రమైన శివ్వంపేట గ్రామంలో మంగళవారం తడి పొడి చెత్త బుట్టిలు, స్మార్ట్ రేషన్ కార్డులను గ్రామస్థులు లకు పంపిణి చేశారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశం లో సర్పంచ్ వెంకటేశ్వర్ మాట్లాడుతూ తమ ఆరోగ్యాలను దృష్టిలో ఉంచుకుని పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని ఆయన సూచించారు. తడి, పొడి చెత్తను ఇంట్లోనే వేరు చేసి, చెత్త ట్రాక్టర్ గ్రామపంచాయతీ కార్మికులకు అందజేయాలనీ ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో గ్రామ పంచాయతీ సెక్రెటరీ రమాదేవి, జీపీఓ యాదగిరి, వార్డు సభ్యులు ముయ్యడి ముత్యాలు, పెద్దగోని శ్రీనివాస్, కొవ్వూరి యాదగిరి, రెడ్డిపల్లి స్వరూప అశోక్, కొడకంచి మాధవి గణేష్ గౌడ్, పెద్దకోళ్ల విక్రమ్, కమల్లయ్యగారి మల్లేశ్వరి నర్సింలు, ఈసారపు రాజు గౌడ్, కోలా కిషన్, గ్రామ కమిటీ అధ్యక్షులు లక్ష్మినర్సయ్య, తదితరులు ఉన్నారు.

# హిందూ దేవుళ్లను కించపరిచారంటూ సీఎం రేవంత్ దిష్టిబొమ్మ దహనం



**గద్వాల, సెప్టెంబర్ 29 (జనంసాక్షి):** హిందూ దేవుళ్లను కించపరిచేలా మాట్లాడారంటూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దిష్టిబొమ్మను బీజేవైఎం నాయకులు దహనం చేశారు. రాష్ట్ర బీజేపీ పిలుపులో భాగంగా గద్వాల పట్టణంలోని గాంధీ చౌక్ వద్ద జిల్లా బీజేవైఎం అధ్యక్షుడు బాబుల్ రెడ్డి ఆధ్వర్యంలో ఈ నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా జిల్లా ప్రధాన కార్యదర్శి రవి కుమార్ ఎక్బోటే మాట్లాడుతూ రాముడు ఉత్తరాది, శివుడు దక్షిణాది అంటూ దేవుళ్లను విడదీయడం సరికాదని, హిందువుల మనోభావాలను దెబ్బతీసేలా సీఎం వ్యాఖ్యలు ఉన్నాయని ఆరోపించారు. ముఖ్యమంత్రి హోదాలో ఉన్న వ్యక్తి బాధ్యతారాహిత్యంగా మాట్లాడటం సిగ్గుచేటని, హిందువుల ఆత్మగౌరవాన్ని కించపరిచే వ్యాఖ్యలను సహించబోమని అన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర ఓబీసీ మోర్చా కోశాధికారి ఆకారం రమేష్, జిల్లా ఓబీసీ మోర్చా అధ్యక్షుడు దేవదాస్, మండల అధ్యక్షుడు తిరుపతి రెడ్డి, సీనియర్ నాయకులు పాల్గొన్నారు.

# ఆయిల్ ఫామ్ నర్సరీని పరిశీలించిన కలెక్టర్...



**ఝరాసంగం, సెప్టెంబర్ 29 (జనంసాక్షి):** రాష్ట్రంలో ఆయిల్ ఫాం కల్టివేషన్ను ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకుని రైతులకు అవగాహన కల్పిస్తూ సాగు చేయడానికి ప్రోత్సాహకాలు అందిస్తుందని అందుకు గాను ఉద్యానవన అధికారులు రైతులకు నాణ్యమైన ఆయిల్ ఫాం మొక్కలు అందేలా చూడాలని సంగారెడ్డి జిల్లా కలెక్టర్ ప్రతీక్జైన్ అన్నారు.మంగళవారం ఝరాసంగం మండల పరిధిలోని పొట్టిపల్లి గ్రామ శివారులో 60 ఎకరాల విస్తీర్ణంలో ఏర్పాటు చేసిన గోద్రేజ్ అగ్రోవేట్ ఆయిల్ ఫాం నర్సరీని సందర్శించి మొక్కల పెంపకాన్ని పరిశీలించారు. నర్సరీలో ఎన్ని మొక్కలు పెంచుతున్నారు. ఏ దశలోని మొక్కలు రైతులు నాటడానికి పంపిణీ చేస్తున్నారు. మొక్క ఎత్తు, చుట్టు కొలత ఎంత ఉండాలి తదితర విషయాలు నిర్వాహకులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్బంగా ఆయన మట్లాడుతూ ఉద్యానవన శాఖ అధికారులు మొక్కల పెంపకం, రైతుల సాగు వారికి అందుతున్న సబ్సీడీలను ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలన్నారు. రైతులకు నాణ్యమైన మొక్కలు అందేలా అవసరమైన అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు. ఎఫ్పీఓల బలోపేతానికి రెండెకరాల స్థలాన్ని ప్రభుత్వం ద్వార సమకూర్చి అందులో కోల్డ్ స్టోరేజ్ నిర్మాణం చేపట్టి మార్కెటింగ్ సదుపాయాలు కల్పించడానికి చర్యలు తీసుకుంటామన్నారు. ఆయన వెంట జిల్లా ఉద్యానవన శాఖాధికారి పి.సోమేశ్వరరావు, ఆర్డీఓ దేవుజా. జహీరాబాద్, కోహీర్ మండలాల ఉద్యాన శాఖాధికారులు పండరి, కె. సునీత, ఏడీఏ వైద్యనాథ్, ఏఓలు వెంకటేశ్, శైలజ, గోద్రేజ్ అగ్రోవేట్ నర్సరీ మేనేజర్ ప్రవీణ్కుమార్, ఏజీఎం ఈశ్వర్రెడ్డి, హెచ్ఈఓ విఠల్ తదితరులు ఉన్నారు.

# రూ.4 కోట్లతో 5 వేల మెట్రిక్ టన్నుల గోదాం మంజూరు

- రంగంపేట సొసైటీలో మహా జనసభ
- సొసైటీ చైర్మన్ అరిగే రమేష్ కుమార్ ఆధ్వర్యంలో
- రైతులకు ఎరువులు, పురుగుమందులు అందుబాటులో ఉంచుతాం



**కొల్చారం, సెప్టెంబర్ 29 (జనంసాక్షి):** కొల్చారం మండలంలోని రంగంపేట ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం (పీఏసీఎస్) పరిధిలోని రైతులకు శుభవార్త అందిందని సొసైటీ చైర్మన్ అరిగే రమేష్ కుమార్ తెలిపారు. సుమారు రూ.4 కోట్ల వ్యయంతో 5 వేల మెట్రిక్ టన్నుల సామర్థ్యం కలిగిన గోదాం మంజూరైనట్లు వెల్లడించారు. అలాగే రైతుల సౌలభ్యం కోసం సొసైటీ ఆధ్వర్యంలో ఎరువులు, పురుగు మందులను అందుబాటులో ఉంచనున్నట్లు తెలిపారు.
మంగళవారం రంగంపేట సొసైటీ చైర్మన్ అరిగే రమేష్ కుమార్ అధ్యక్షతన మహాజన సర్వసభ్య సమావేశం నిర్వహించారు. సమావేశానికి పాలక మండలి డైరెక్టర్లు, రైతులు హాజరయ్యారు. ఈ సందర్భంగా పలు కీలక అంశాలపై చర్చించి తీర్మానాలు చేశారు.
**చైర్మన్ మాట్లాడుతూ..** పూర్వీకుల సమయస్ఫూర్తితో సొసైటీకి స్థలం కేటాయించి ఉంచడం వల్ల 5 వేల మెట్రిక్ టన్నుల సామర్థ్యం కలిగిన గోదాం మంజూరైందన్నారు. గోదాం నిర్మాణంతో రైతులకు మరింత ఉపయోగం కలుగుతుందని తెలిపారు. ఇకపై సొసైటీ ఆధ్వర్యంలో ఎరువులు, పురుగుమందులను రైతులకు అందుబాటులో ఉంచి వారి అవసరాలను తీర్చేందుకు చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

# జహీరాబాద్‌లో ఉద్రిక్తత.. బీఆర్ఎస్ కార్యకర్త ఆత్మహత్య



**సంగారెడ్డి బ్యూరో, సెప్టెంబర్ 29 (జనంసాక్షి):** సంగారెడ్డి జిల్లా కోహిర్ మండలం బిలాల్‌పూర్‌కు చెందిన బీఆర్ఎస్ కార్యకర్త గూళ్ల శేఖర్ ఆత్మహత్య ఘటన జహీరాబాద్‌లో ఉద్రిక్తతకు దారితీసింది. బంగారు ఆభరణాల చోరీ కేసు విచారణ పేరుతో పోలీసులు వేధించడంతోనే శేఖర్ ఆత్మహత్య చేసుకున్నాడని కుటుంబ సభ్యులు, బంధువులు ఆరోపించారు. పోలీసులు శేఖర్‌ను అదుపులోకి తీసుకుని కొట్టడంతో తీవ్ర మనస్తాపానికి గురయ్యాడని వారు పేర్కొన్నారు. ఘటనపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ జాతీయ రహదారిపై బైఠాయించి ఆందోళన చేపట్టారు. దీంతో కొంతసేపు ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి.
ఆందోళనకు బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు చింత ప్రభాకర్, మాణిక్‌రావు మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ ప్రభుత్వం అధికారాన్ని అడ్డుపెట్టుకుని బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలను పోలీసులు వేధిస్తున్నారని వారు ఆరోపించారు. పోలీసులు అతిగా వ్యవహరించడం సరికాదని పేర్కొంటూ, శేఖర్ మృతిపై సమగ్ర విచారణ జరిపి వాస్తవాలను వెలుగులోకి తీసుకురావాలని డిమాండ్ చేశారు. కుటుంబానికి న్యాయం జరిగే వరకు అండగా ఉంటామని హామీ ఇచ్చారు.

# అనుమతులపై పరిశ్రమకు నోటీసులు





**రాజాపూర్, సెప్టెంబర్ 29 (జనంసాక్షి):** ముదిరెడ్డిపల్లి గ్రామ పంచాయతీ పరిధిలోని సర్వే నంబర్లు 635, 636లో ఉన్న రీ ఎనర్జీ మేక్ ప్రైవేట్ లిమిటెడ్ పరిశ్రమకు అనుమతులపై సందేహాలు వ్యక్తమవుతున్నాయి. సెప్టెంబర్ 23న పంచాయతీ కార్యదర్శి పరిశ్రమ యాజమాన్యానికి అనుమతుల వివరాలు కోరుతూ నోటీసులు జారీ చేశారు. పరిశ్రమకు పంచాయతీ అనుమతి, టీఎస్ఐపాస్ అనుమతులు లేవని కార్యదర్శి తెలిపినట్లు సమాచారం. అనుమతులు లేకుంటే విద్యుత్ సరఫరా ఎలా జరిగిందనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. రెండేళ్లుగా పరిశ్రమ కార్యకలాపాలు కొనసాగుతున్నా సంబంధిత అనుమతులపై అధికారులు ఎందుకు దృష్టి సారించలేదనే చర్చ జరుగుతోంది. మండలంలో ఇలాంటి అనుమతులు లేని పరిశ్రమలు మరెన్ని ఉన్నాయనే అంశంపై ప్రజలు చర్చించుకుంటున్నారు.

# భద్రత ఏర్పాట్లను పరిశీలించిన పోలీస్ బాస్

- రేజింతల్ స్వయంభూను దర్శించుకున్న ఎస్పీ
- భక్తులకు అసౌకర్యాలు కలక్కుండా చూడాలని ఆదేశం





**న్యాల్‌కల్, సెప్టెంబర్ 29 (జనంసాక్షి):** జిల్లా పోలీస్ ఉన్నతాధికారి పరితోష్ పంకజ్ భక్తుల భద్రత ఏర్పాట్లను పరిశీలించారు. వేలాదిగా వస్తున్న భక్తజనం ఎలాంటి అసౌకర్యాలకు గురి కాకుండా పోలీస్ యంత్రాంగం ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు. మంగళవారం అంగారక చతుర్థి పర్వదినం శుభ సందర్భంగా.. జహీరాబాద్ డీఎస్పీ సైదా నాయక్ తో కలిసి మండలంలోని స్వయంభూగా కొలువుదీరిన రేజింతల్ శ్రీ సిద్ధి వినాయకున్నీ దర్శించుకున్నారు. ఆలయ వేద పండితులు, ట్రస్ట్ భక్తమండలి ఎస్పీని పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. వేద పండితుల మంత్రోచ్చరణల మధ్య ఎస్పీ ప్రత్యేక పూజలు చేశారు. ట్రస్ట్ భక్త మండలి ఎస్పీ, డీఎస్పీని శాలువాతో సత్కరించారు. అనంతరం సిద్ధి వినాయక క్షేత్రం ఆవరణలోని ప్రసాద వితరణ కేంద్రం, శీఘ్ర, ప్రత్యేక, ఉచిత దర్శనాల ప్రదేశాన్ని, శౌచాలయాలు, త్రాగునీటి సౌకర్యం, వాహనాల ఏర్పాటు, భక్తులకు భద్రతా సౌకర్యం, తదితర ఏర్పాట్లను పరిశీలించారు. భక్తులు అధిక సంఖ్యలో వస్తున్న నేపథ్యంలో గుర్తుతెలియని వ్యక్తులు చోరీలకు పాల్పడే ఆస్కారం ఉందని, అపరిచిత వ్యక్తులపై ప్రత్యేక దృష్టి సారించాలని స్థానిక పోలీసులకు ఆదేశించారు. కార్యక్రమంలో జహీరాబాద్ రూరల్ సీఐ జక్కుల హనుమంతు, ఎస్సై సుజిత్, పోలీస్ సిబ్బంది, ట్రస్ట్ భక్తమండలి పాల్గొన్నారు.

# మనోహరాబాద్‌లో ఇంటి స్థలం అక్రమ రిజిస్ట్రేషన్

- సబ్ రిజిస్టర్ కార్యాలయం ముందు బాధితుల ఆందోళన
- అధికారులపై కఠినమైన చర్యలు తీసుకోవాలి






**మనోహరాబాద్, సెప్టెంబర్ 30 (జనంసాక్షి):** మెదక్ జిల్లా మనోహరాబాద్ చెందిన మాస నూరి లక్ష్మి తన భర్త మాస నూరి భూమయ్య 2012 సంవత్సరంలో అనారోగ్య కారణంతో మృతి చెందడంతో తన భర్త పేరు పైన ఉన్న 357 గజాల ఇంటి స్థలాన్ని దగ్గరి బంధువు మాసనూరి సత్తమ్మ పేరుపైన అప్పటి కార్యదర్శి సహాయంతో తూప్రాన్ సబ్ రిజిస్టర్ కార్యాలయంలో 2013 సంవత్సరంలో గిఫ్ట్ డిడ్ కింద సత్యమ్మ కుమారుడు మాస నూరిరవి కుమార్ రిజిస్ట్రేషన్ చేయించారని మండిపడ్డారు వాస్తవంగా అక్కడ 357 గజాలు స్థలం ఉండగా 440 గజాలు రిజిస్ట్రేషన్ చేయించారు . అనంతరం మాసనూరి రవికుమార్ 220 గజాలు అతని కుమారుడు భాస్కర్ కు220 గజాలు రిజిస్టర్ చేయించుకున్నారు అంతే కాక ప్రక్కన ఉన్న వారి స్థలమును అక్రమ ఆక్రమించి అనంతరం ఇంటి నిర్మాణం కోసం ఓ ఫైనాన్స్ కంపినిలో 15 లక్షల లోన్ పొందారు గ్రామ కార్యదర్శి మరియు అక్రమ రిజిస్ట్రేషన్ చేసిన సబ్ రిజిస్టర్ ను సస్పెండ్ చేసి అక్రమ రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్ తొలగించి తమ పేరు పైన రిజిస్ట్రేషన్ చేయాలని డిమాండ్ చేశారు.

# కలెక్టర్ ప్రతిక్ జైన్ ప్రత్యేక చొరవ



న్యాల్‌కల్ (46 విద్యార్థులు) లో తహసిల్దార్ ప్రభులు, కస్తూర్బా గాంధీ గురుకులంలో (14 విద్యార్థులు) ఇన్చార్జి ఎంపీడీఓ నరేష్, హద్నూర్ లో (49గురు విద్యార్థులు) ఇన్చార్జి ఎంపిఓ ఎఫ్ఎసి ధనరాజ్ పర్యవేక్షణలో పరీక్ష కొనసాగింది. జిల్లాలో కనీసం 100 గురు విద్యార్థులు స్క్రీనింగ్ టెస్ట్ లో అర్హత సాధించిన వారికి ప్రత్యేకంగా.."నీట్ ఉచిత కోచింగ్" ఇవ్వనున్నారు. ఈ మేరకు మంగళవారం మధ్యాహ్నం కలెక్టర్ ప్రతీక్ జైన్, జహీరాబాద్ ఆర్డిఓ దేవుజాలు మండలంలోని హద్నూర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో కొనసాగుతున్న "నీట్ స్క్రీనింగ్ టెస్ట్" పరీక్ష కేంద్రాన్ని పరిశీలించారు. కలెక్టర్ ముందస్తు సమాచారంతో మండలంలోని ఇంటర్ మొదటి, రెండవ సంవత్సరం చెందిన 109 గురు బైపిసి విద్యార్థులు విద్యార్థులు పరీక్షలు రాశారు.

## మండల సమీక్షకు అధికారుల గైర్హాజరు



**మిడ్జిల్, సెప్టెంబర్ 29 (జనంసాక్షి):** గ్రామీణ సమస్యల పరిష్కారానికి నిర్వహించిన మండల స్థాయి సమీక్ష సమావేశానికి కొందరు అధికారులు, ప్రజాప్రతినిధులు గైర్హాజరయ్యారు. దీంతో సమావేశం లాంఛనంగా ముగిసిందని ప్రజలు అసంతృప్తి వ్యక్తం చేశారు. హాజరైన అధికారులు కూడా డ్రైనేజీ, తాగునీరు, రోడ్ల తదితర సమస్యలపై లోతుగా చర్చించకుండా నివేదికలకే పరిమితమయ్యారని ఆరోపించారు. అధికారులు, ప్రజాప్రతినిధుల మధ్య సమన్వయం లేకపోవడంతో గ్రామీణ అభివృద్ధి కుంటుపడుతోందన్నారు. ఇకనైనా అన్ని శాఖల అధికారులు, గ్రామాల ప్రజాప్రతినిధులు సమీక్షలకు విధిగా హాజరయ్యేలా చర్యలు తీసుకోవాలని, ప్రజా సమస్యలను త్వరగా పరిష్కరించాలని మండల ప్రత్యేక అధికారిని కోరారు.

# బలమైన బాల్యానికి వేయి మెట్లు

## గర్భస్థ దశ నుంచి ఐదేళ్ల వరకు పోషణ, ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ



**కోహిర్, సెప్టెంబరు 29 (జనంసాక్షి):** గర్భస్థ దశ నుంచి చిన్నారికి ఐదేళ్ల వయస్సు వచ్చే వరకు పోషకాహారం, ఆరోగ్య సంరక్షణపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని బిలాల్‌పూర్ రైతు వేదికలో నిర్వహించిన ఏఎఎ ఓరియంటేషన్ శిక్షణలో సూచించారు. అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు తులసి, గ్రేసి, మెడికల్ ఆఫీసర్ దివ్యజ్యోతి, రాము, పవన్, డాక్టర్ సంజన సిబ్బందికి పలు అంశాలపై శిక్షణ ఇచ్చారు.

**సమన్వయంతో మెరుగైన సేవలు**

ఏఎఎ కార్యక్రమం ద్వారా గర్భిణీలు, బాలింతలు, శిశువులు, చిన్నారులకు అందించాల్సిన ఆరోగ్య, పోషణ సేవలపై అవగాహన కల్పించారు. గ్రామ స్థాయిలో అర్హులైన లబ్ధిదారులను గుర్తించి వారికి అవసరమైన సేవలు సకాలంలో అందించాలని సూచించారు. అంగన్‌వాడీ టీచర్లు, ఆశా వర్కర్లు, ఏఎన్ఎంలు, ఎంఎల్‌హెచ్‌పీలు సమన్వయంతో పనిచేస్తే మెరుగైన సేవలు అందించవచ్చన్నారు. ప్రతి చిన్నారి ఎదుగుదలను నిరంతరం గమనించి, ఆరోగ్య సమస్యలు తలెత్తితే వెంటనే వైద్య సిబ్బంది దృష్టికి తీసుకురావాలని సూచించారు.

**ఐవైసీఎఫ్‌పై ప్రత్యేక అవగాహన**

శిక్షణలో ఐవైసీఎఫ్ (ఇన్ఫాంట్ అండ్ యంగ్ చైల్డ్ ఫీడింగ్)పై ప్రత్యేకంగా వివరించారు. శిశువులకు తల్లిపాలు అందించడం, సరైన సమయంలో అనుబంధ ఆహారం ప్రారంభించడం, వయస్సుకు అనుగుణంగా పోషక విలువలతో కూడిన ఆహారం అందించడం వంటి అంశాలను వివరించారు. చిన్నారుల ఎదుగుదలలో తొలి సంవత్సరాలు కీలకమని, ఈ దశలో సరైన పోషకాహారం అందకపోతే ఎదుగుదలపై ప్రభావం పడే అవకాశం ఉందన్నారు. తల్లిదండ్రులకు కూడా నిరంతరం అవగాహన కల్పించాలని సూచించారు.

**పోషకాహార లోపాలను తొలిదశలోనే గుర్తించాలి**

ఎస్ఎస్ఎఫ్‌పీపై కూడా సిబ్బందికి శిక్షణ ఇచ్చారు.



పిల్లల పోషక స్థితిని క్రమం తప్పకుండా పర్యవేక్షించడం, పోషకాహార లోపం ఉన్నవారిని తొలిదశలోనే గుర్తించడం, అవసరమైన సేవలు అందించడం, ఫాలోఅప్ నిర్వహించడం వంటి అంశాలను వివరించారు. పిల్లల బరువు, ఎదుగుదలలో మార్పులను పరిశీలిస్తూ అవసరమైనప్పుడు వైద్య సేవలకు రిఫర్ చేయాలని సూచించారు. ప్రారంభ దశలోనే పోషకాహార లోపాలను గుర్తించి తగిన చర్యలు తీసుకుంటే పిల్లల ఆరోగ్యాన్ని మెరుగుపరచవచ్చన్నారు.

**తల్లి-శిశు ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి**

అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అందిస్తున్న పోషణ సేవలు, తల్లి-శిశు ఆరోగ్యం, పిల్లల ఎదుగుదల పర్యవేక్షణపై అవగాహన కల్పించారు. గర్భధారణ నుంచే తల్లి ఆరోగ్యంపై శ్రద్ధ వహించడంతో పాటు ప్రసవానంతరం తల్లి, శిశువుల సంరక్షణకు ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. గ్రామస్థాయిలో ఆరోగ్య, పోషణ కార్యక్రమాలు సమర్థవంతంగా అమలు కావాలంటే వివిధ శాఖల సిబ్బంది సమన్వయంతో పనిచేయడం కీలకమని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆశావర్కర్లు, అంగన్‌వాడీ టీచర్లు, తదితరులు పాల్గొన్నారు.

# అక్రమ రిజిస్ట్రేషన్‌పై చర్యలు తీసుకోవాలి



**తూప్రాన్, సెప్టెంబర్ 29 (జనంసాక్షి):** ఇంటి స్థలాన్ని తమకు తెలియకుండా అక్రమంగా రిజిస్ట్రేషన్ చేశారని ఆరోపిస్తూ బాధితులు సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం ఎదుట ఆందోళన చేపట్టారు. మనోహరాబాద్‌కు చెందిన మాసనూరి లక్ష్మి మాట్లాడుతూ తన భర్త భూమయ్య పేరున ఉన్న 357 గజాల స్థలాన్ని 2013లో గిఫ్ట్‌డీడ్ ద్వారా బంధువుల పేరున రిజిస్టర్ చేశారని ఆరోపించారు. వాస్తవంగా 357 గజాలు ఉండగా 440 గజాలుగా నమోదు చేశా రని, అనంతరం 220 గజాల చొప్పున రవికుమార్, ఆయన కుమా రుడు భాస్కర్ పేర్లకు బదలాయించారని తెలిపారు. పక్క స్థలాన్ని కూడా ఆక్రమించి రూ.15 లక్షల రుణం పొందారని ఆరోపించారు. అక్రమ రిజిస్ట్రేషన్ రద్దు చేసి తమ పేరున నమోదు చేయాలని, బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

# ఐదు రూపాయల నాణెం మింగిన పదిఏళ్ల బాలుడు..

**మహమ్మదాబాద్, సెప్టెంబర్ 29 (జనంసాక్షి):** ఐదు రూపాయల నాణెం మింగిన ఘటన మహబూబ్‌నగర్ జిల్లా మహమ్మదాబాద్ మండలం గాధిర్యాల్ గ్రామంలో మంగళవారం సాయంత్రం చోటుచేసుకుంది. గాధిర్యాల్ గ్రామానికి చెందిన పదేళ్ల బాలుడు ప్రమాదవశాత్తు ఐదు రూపాయల నాణెం మింగాడు. విషయం గమనించిన, తల్లిదండ్రులు అప్రమత్తమై వెంటనే బాలుడిని చికిత్స నిమిత్తం మహబూబ్‌నగర్‌లోని ఆస్పత్రికి తరలించారు. బాలుడికి ఎలాంటి ప్రమాదం జరగకుండా వైద్యులు చికిత్స అందిస్తున్నట్లు తెలిసింది. అనంతరం చిన్నపిల్లల విషయంలో తల్లిదండ్రులు అప్రమత్తంగా ఉండాలని గ్రామస్తులు కోరుతున్నారు.

# ఏబీవీపీ నూతన మండల కార్యవర్గం ఎంపిక

- ఏబీవీపీ వనపర్తి జిల్లా కన్వీనర్ దేవర్ల కార్తీక్
- మండల కన్వీనర్‌గా కే.నందు




**శ్రీరంగాపురం, సెప్టెంబర్ 29 (జనంసాక్షి):** అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ (ABVP) వనపర్తి జిల్లా, శ్రీరంగాపురం మండలం ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించబడింది. ఈ సందర్భంగా శ్రీరంగాపురం మండల నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది.

ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న వనపర్తి జిల్లా కన్వినర్ దేవర్ల కార్తీక్ మాట్లాడుతూ, ఏబీవీపీ 1949 జూలై 9న కేవలం ఐదుగురు విద్యార్థులతో ప్రారంభమైన అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ నేడు ప్రపంచంలోనే అతిపెద్ద విద్యార్థి సంఘంగా ఎదిగిందన్నారు. విద్యా, సామాజిక, జాతీయ అంశాలపై అనేక ఉద్యమాలకు ఏబీవీపీ నాయకత్వం వహించిందని తెలిపారు. నక్సలిజానికి వ్యతిరేకంగా పోరాటంలో దాదాపు 44 మంది ఏబీవీపీ కార్యకర్తలు వీరమరణం పొందారని పేర్కొన్నారు. కాశ్మీర్‌లో ఉగ్రవాదులకు సవాల్ విసురుతూ లాల్‌చౌక్‌లో జాతీయ పతాకాన్ని ఏబీవీపీ కార్యకర్తలే ఎగురవేశారని తెలిపారు. అనంతరం శ్రీరంగాపురం మండల నూతన కార్యవర్గాన్ని ప్రకటించారు. శ్రీరంగాపురం మండల కన్వినర్‌గా కే.నందు ఎన్నికయ్యారు. మండల కో-కన్వినర్‌గా మాసూమ్, నగర కార్యవర్గ సభ్యులుగా కళ్యాణ్, శివప్రసాద్, అసిఫ్ పాషా, తేజ, అర్జున్ చంద్ర లను మండల నూతన కార్యవర్గంగా నియమిచడం జరిగింది.

## రూ.11.28 లక్షల

# అద్దె నిధుల దుర్వినియోగం




**గద్వాల, సెప్టెంబర్ 29 (జనంసాక్షి):** మున్సిపల్ షాపుల అద్దె వసూళ్లలో రూ.11.28 లక్షలు దుర్వినియోగమైన వ్యవహారంపై జిల్లా కలెక్టర్ రిజ్వాన్ భాషా షేక్ చర్యలు చేపట్టారు. అద్దె సొమ్మును మున్సిపల్ ఖాతాలో జమ చేయకుండా వినియోగించినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న సీనియర్ అసిస్టెంట్, ఇన్‌చార్జ్ రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ రాజవర్ధన్, జూనియర్ అసిస్టెంట్, ఇన్‌చార్జ్ షరాఫ్ రాజవర్ధన్ నాయుడులను సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. వ్యవహారంపై సమగ్ర విచారణకు అదనపు కలెక్టర్ (లోకల్ బాడీస్) నర్సింగరావును నియమించారు. రశీదు పుస్తకాలు, రికార్డులు, రిమిటెన్స్ వివరాలను పరిశీలించి నివేదిక సమర్పించాలని ఆదేశించారు.

# గిరిజనుల భూ సమస్యల పరిష్కారానికి కృషి



**రహదారి, పోడు భూముల సమస్యలపై పరిశీలన**

వనపర్తి మండలం సవాయి గూడెం తండాలో రహదారి సౌకర్యం లేక ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు. సమస్యను అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. కిష్టగిరి తండాలో పోడు భూములను పరిశీలించి గిరిజన రైతులతో మాట్లాడారు. భూ హక్కులు, వైద్యం, రహదారులు, ఇతర మౌలిక సదుపాయాల సమస్యలను అధికారుల సమన్వయంతో పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటానని తెలిపారు. కార్యక్రమంలో ఆర్డీవో సుబ్రహ్మణ్యం, వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, గిరిజన నాయకులు పాల్గొన్నారు.

# పోలీసుల వేధింపుల ఆరోపణల మధ్య యువకుడి ఆత్మహత్య

- విచారణలో కొట్టారని బంధువుల ఆరోపణలు.. వాస్తవం లేదన్న డీఎస్పీ

**కోహిర్, సెప్టెంబర్ 29 (జనంసాక్షి):** సంగారెడ్డి జిల్లా కోహిర్ మండలం బిలాల్‌పూర్‌లో శేఖర్ (30) అనే యువకుడు మంగళవారం ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసుల వేధింపులు, దెబ్బల భయంతోనే ఈ ఘటన జరిగిందని మృతుడి కుటుంబ సభ్యులు, బంధువులు ఆరోపిస్తున్నారు. అయితే పోలీసుల వేధింపుల ఆరోపణల్లో వాస్తవం లేదని డీఎస్పీ సైదా తెలిపారు.

**బంగారు ఆభరణాల చోరీ కేసులో విచారణ...**

బిలాల్‌పూర్‌కు చెందిన గూళ్ల రాజు కుమారుడు శేఖర్‌ను బంగారు ఆభరణాల చోరీ కేసు విచారణలో భాగంగా జహీరాబాద్ పట్టణ పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు డీఎస్పీ తెలిపారు. విచారణ పేరుతో పోలీసులు తనను కొట్టి వేధించారని శేఖర్ కుటుంబ సభ్యులు ఆరోపించారు. సోమవారం రాత్రి సుమారు 11 గంటలకు మాజీ జెడ్పీటీసీ సభ్యుడు, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు నర్సింలు పూచీకత్తుపై శేఖర్‌ను ఇంటికి తీసుకువచ్చినట్లు తెలిపారు.

**ఉదయం స్టేషన్‌కు రావాలని సూచన...**

మంగళవారం ఉదయం తిరిగి పోలీస్‌స్టేషన్‌కు రావాలని శేఖర్‌కు పోలీసులు సూచించినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. స్టేషన్‌లో జరిగిన ఘటనతో భయాందోళనకు గురైన శేఖర్ ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడని వారు ఆరోపించారు. ఈ ఆరోపణలను పోలీసులు ఖండించారు. శేఖర్‌ను అదుపులోకి తీసుకున్నది వాస్తవమేనని, అనంతరం పూచీకత్తుపై ఇంటికి





పంపించినట్లు డీఎస్పీ తెలిపారు. టౌన్ ఎస్ఐ వేధించారన్న ఆరోపణల్లో ఎలాంటి వాస్తవం లేదని స్పష్టం చేశారు.

**కుటుంబానికి పెద్ద దిక్కుగా ఉన్న శేఖర్...**

శేఖర్ మృతితో కుటుంబం విషాదంలో మునిగింది. మృతుడి తల్లికి కంటి చూపు లేదని, ఒక తమ్ముడు ఉన్నాడని బంధువులు తెలిపారు. కుటుంబానికి సంపాదించే ప్రధాన వ్యక్తి మృతి చెందడంతో తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. యువకుడి ఆత్మహత్యకు అసలు కారణాలు ఏమిటన్నది దర్యాప్తులో తేలాల్సి ఉంది. కుటుంబ సభ్యుల ఆరోపణలు, పోలీసుల వివరణ నేపథ్యంలో పూర్తిస్థాయి విచారణ జరిపి వాస్తవాలను వెలుగులోకి తేవాలని గ్రామస్థులు కోరుతున్నారు.

# అంగన్వాడీ, ఆశ వర్కర్ల సేవలు అభినందనీయం



**కృష్ణ, సెప్టెంబర్ 29 (జనంసాక్షి):** సేవా సంకల్ప అభియాన్‌లో భాగంగా కున్సి, అలంపల్లి గ్రామాల్లో అంగన్వాడీ టీచర్లు, ఆశ వర్కర్లను మండల బీజేపీ అధ్యక్షుడు నల్లే నర్సప్ప సన్మానించారు. గ్రామీణ స్థాయిలో చిన్నారులు, కిశోర బాలికలు, గర్భిణుల సంక్షేమానికి వారు అందిస్తున్న సేవలను ఆయన అభినందించారు. ప్రజలకు మరింత చేరువగా సేవలు అందించాలని సూచించారు. కార్యక్రమంలో బీజేపీ మండల ప్రధాన కార్యదర్శి దండు రాఘవేంద్ర, బీజేవైఎం అధ్యక్షుడు వొట్టే సురేష్, బూత్ అధ్యక్షులు, నాయకులు పాల్గొన్నారు.

## అత్యవసర పరిస్థితుల్లో అండగా...



**పాపన్నపేట, సెప్టెంబర్ 29 (జనంసాక్షి):** పేద, మధ్య తరగతి ప్రజలకు అత్యవసర పరిస్థితుల్లో సీఎంఆర్ఎఫ్ అండగా నిలుస్తుందని మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ రావు పేర్కొన్నారు. పాపన్నపేటకు చెందిన నిజాముద్దీన్ కు ఇటీవల కాలుకు శస్త్ర చికిత్స జరిగింది. ఈసందర్భంగా మెదక్ ఎమ్మెల్యే మంగళవారం కార్యాలయంలో రూ. 75 వేల సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కును అతడికి అందజేశారు. కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు నరేందర్ గౌడ్, ముద్దాపూర్ సర్పంచ్ నాగరాజు, పాపన్నపేట ఉప సర్పంచ్ సద్దాంహుస్సేన్ తదితరులు ఉన్నారు.

## మనస్తాపంతో యువకుడి ఆత్మహత్య



**చిన్న శంకరంపేట్, సెప్టెంబర్ 28 (జనంసాక్షి):** యువకుడు ఆత్మ హత్యకు పాల్పడిన ఘటన చిన్న శంకరంపేట మండల పరిధిలోని సూరారం గ్రామంలో మంగళ వారం చోటుచేసుకుంది. స్థానికు లు తెలిపిన వివరాల ప్రకారం... దుండు మహేష్ (22) మంగళ వారం ఉదయం కుటుంబ సభ్యుల తో కొట్లాడినాడని, కుటుంబ సభ్యులు వ్యవసాయ పనులకు వెళ్ళ గానే ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడినట్లు తెలిపారు.

## వీబీ-జీ రామ్ జీతో ఉపాధికి భరోసా



**ఊర్కొండ, సెప్టెంబర్ 28 (జనంసాక్షి):** వీబీ-జీ రామ్ జీ పథకంతో గ్రామీణ ఉపాధికి భరోసా కలుగుతుందని ఇప్పపహాడ్ సర్పంచ్ బెక్కెర సునీత రాజశేఖర్‌రెడ్డి తెలిపారు. గ్రామ సభలో ఎంపీడీవో సత్యపాల్‌రెడ్డితో కలిసి కూలీలు, మహిళా సంఘాలకు పథకంపై అవగాహన కల్పించారు. 100 రోజులకు బదులు 125 రోజుల పని, 15 రోజుల్లోపు కూలీ డబ్బులు ఖాతాల్లో జమ అవుతాయని తెలిపారు. అనంతరం గ్రామంలో జరుగుతున్న అభివృద్ధి పనులను పరిశీలించారు. కార్యక్రమంలో ఏపీవో నర్సింహులు, సిబ్బంది, మహిళా సంఘాల సభ్యులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

## సింగారం గ్రామంలో వరి పొలాలను పరిశీలించిన సమన్వయ కర్త: ఈటెల



**నారాయణపేట సెప్టెంబర్ 29(జనంసాక్షి):** నారాయణపేట మండలం సింగారం గ్రామంలోని వరి పొలాలను టి ఆర్ వి కే.నారాయణపేట సమన్వయకర్త డా. ఈటెల సత్యనారాయణ మంగళ వారం సందర్శించారు. ఈ సందర్భంగా వరి పంటను పరిశీలించి ఆకుమచ్చ తెగులును గుర్తించారు. పంట త్వరగా కోలుకునేందుకు తగిన సస్యరక్షణ, యాజమాన్య పద్ధతులను రైతులకు సూచించారు. అలాగే వరి పంటలో యూరియా వినియోగం, సరైన మోతాదు మరియు సకాలంలో యూరియా దరఖాస్తు చేయడం వల్ల కలిగే ప్రయోజనాలను రైతులకు వివరించారు. పంట ఎదుగుదల దశను బట్టి పోషకాలను సమయానుకూలంగా అందించాలని సూచించారు. ఈ క్షేత్ర సందర్శనలో ఏఈఓ అనిల్ కుమార్ రైతులు పాల్గొన్నారు.

# క్రీడాకారులకు పతకాలు.. ఆసుపత్రిలో ఆధునిక పరికరాలు

- మాజీ డిసిసి అధ్యక్షురాలు నిర్మల జగ్గారెడ్డి

**సంగారెడ్డి, సెప్టెంబర్ 29 (జనంసాక్షి):** సంగారెడ్డి పట్టణంలో మంగళవారం నిర్వహించిన పలు కార్యక్రమాల్లో మాజీ డీసీసీ అధ్యక్షురాలు నిర్మలా జగ్గారెడ్డి పాల్గొన్నారు. అంబేద్కర్ స్టేడియంలో నిర్వహించిన నేషనల్ లెవల్ ఇంటర్ డిస్ట్రిక్ట్ అథ్లెటిక్స్ మీట్ ఎంపిక ప్రక్రియకు ముఖ్య అతిథిగా హాజరై క్రీడాకారులను అభినందించారు. జిల్లా నుంచి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైన క్రీడాకారుల ప్రతిభను పరిశీలించి, నవంబర్ 14, 16 తేదీల్లో వోక్సెన్‌లో జరగనున్న పోటీలకు ఎంపికైన వారికి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం విజేతలకు గోల్డ్, సిల్వర్, బ్రాంజ్ పతకాలను అందజేశారు. ఎంపిక ప్రక్రియలో సుమారు 600 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. కార్యక్రమంలో జిల్లా అథ్లెటిక్స్



అసోసియేషన్ అధ్యక్షుడు సోహైల్ అలీ, కార్యదర్శి జావిద్ అలీ, రవి, పీఈటీలు, పీడీలు పాల్గొన్నారు.

**ప్రైడ్ ఆసుపత్రిలో ఆధునిక పరికరాల ప్రారంభం**

అనంతరం సంగారెడ్డిలోని ప్రైడ్ ఆసుపత్రిలో నూతన వైద్య పరికరాలను నిర్మలా జగ్గారెడ్డి ప్రారంభించారు. అత్యవసర పరిస్థితుల్లో రోగులకు ఉపయోగపడే మెకానికల్ సీపీఆర్ పరికరాన్ని ఆవిష్కరించారు. గుండెలోని రక్తనాళాల్లో వాల్వ్ బ్లాకేజీ పరిమాణాన్ని



గుర్తించేందుకు ఉపయోగపడే మరో ఆధునిక పరికరాన్ని కూడా ప్రారంభించారు. ఆధునిక వైద్య సాంకేతికత అందుబాటులోకి రావడం వల్ల అత్యవసర పరిస్థితుల్లో రోగులకు వేగంగా, మెరుగైన వైద్యం అందించే అవకాశం ఉంటుందని ఆమె తెలిపారు. కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు జార్జ్ మాథ్యూస్, డాక్టర్ అనిల్, నాయకులు ప్రవీణ్, కూన వేణు తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు సమగ్ర ఆరోగ్య పరీక్షలు



**మల్దకల్, సెప్టెంబర్ 29 (జనంసాక్షి):** మండల కేంద్రంలోని పిఎం శ్రీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళ వారం విద్యార్థులకు సమగ్ర ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. బ్లడ్ గ్రూప్, కంటి పరీక్షలు, బరువు, హీమోగ్లోబిన్ తదితర పరీక్షలు చేశారు. వ్యక్తిగత పరిశుభ్రత, పౌష్టికాహారం, ఆరోగ్యకరమైన జీవనశైలిపై అవగాహన కల్పించారు. ఆరోగ్య సమస్యలను ప్రారంభ దశలోనే గుర్తించి తగిన చికిత్స పొందేందుకు క్రమం తప్పకుండా ఆరోగ్య పరీక్షలు అవసరమని డాక్టర్ నవీన్ తెలిపారు. కార్యక్రమంలో ల్యాబ్ టెక్నీషియన్ రామస్వామి, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## పీఆర్టీయూ టీఎస్ నూతన కార్యవర్గం ఎన్నిక

**కొల్చారం, సెప్టెంబర్ 29 (జనంసాక్షి):** పోతంశెట్టిపల్లి హనుమమ్మ గార్డెన్‌లో నిర్వహించిన పీఆర్టీయూ టీఎస్ సర్వసభ్య సమావేశంలో 2026-28 సంవత్సరాలకు నూతన మండల కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా పట్లూరి సత్యనారాయణ, ప్రధాన కార్యదర్శిగా కె. కరుణాకర్, అసోసియేట్ అధ్యక్షుడిగా యాదవ రెడ్డి, మహిళా అసోసియేట్ అధ్యక్షురాలిగా జి. రేణుక, ఉపాధ్యక్షుడిగా శశాంక్ ఏగొండ ఎన్నికయ్యారు. కార్యదర్శులుగా మహేష్, వెంకటేశం, సుకన్య, నవితలను ఎన్నుకున్నా



రు. ఎన్నికల పరిశీలకులు డి.నాగేందర్ రెడ్డి, బుచ్చి రాములు నూతన కార్యవర్గాన్ని ప్రకటించారు. ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారంతో పాటు పీఆర్సీ, డీఏల సాధనకు నిరంతరం కృషిచేస్తామని అధ్యక్షుడు సత్యనారాయణ తెలిపారు.

# రైతులకు ఇబ్బందులు లేకుండా ధాన్యం సేకరణ

### అక్టోబర్ 1 నుంచి కొనుగోలు కేంద్రాలు ప్రారంభించాలి: కలెక్టర్ ఖుష్బూ గుప్తా

**మహబూబ్‌నగర్ బ్యూరో, సెప్టెంబర్ 29 (జనంసాక్షి):** ఖరీఫ్ 2026-27 సీజన్‌లో ధాన్యం సేకరణను పకడ్బందీగా నిర్వహించి రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లో ధాన్యం కొనుగోలుపై నిర్వహించిన అవగాహన, శిక్షణ కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. అక్టోబర్ 1 నుంచి కొనుగోలు కేంద్రాలు ప్రారంభించేలా ఏర్పాట్లు పూర్తి చేయాలని సూచించారు.

జిల్లాలో సుమారు 4.26 లక్షల టన్నుల ధాన్యం ఉత్పత్తి అవుతుందని అంచనా ఉండగా, 1.53 లక్షల టన్నులను కొనుగోలు కేంద్రాల ద్వారా సేకరించనున్నట్లు తెలిపారు. ఇందుకోసం 163 కేంద్రాలు ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు. కేంద్రాల్లో గన్నీ సంచులు, తూకం యంత్రాలు, తేమ పరీక్ష పరికరాలు, ధాన్యం శుభ్రపరిచే యంత్రాలు, సిబ్బంది వంటి మౌలిక వసతులు సిద్ధంగా ఉంచాలని ఆదేశించారు. ఎత్తైన, ముంపు లేని ప్రాంతాల్లో కేంద్రాలను ఏర్పాటు చేసి రైతులకు తాగునీరు, నీడ, కూర్చునే సౌకర్యం, విద్యుత్ కల్పించాలని సూచించారు.



సన్న, దొడ్డు రకాల ధాన్యానికి వేర్వేరు కౌంటర్లు ఏర్పాటు చేయాలని, GPS వాహనాల ద్వారా ధాన్యాన్ని నిర్దేశిత మిల్లులు, గోడౌన్లకు తరలించాలని తెలిపారు. కొనుగోలు వివరాలను అదే రోజు OPMSలో నమోదు చేసి రికార్డులు సక్రమంగా నిర్వహించాలన్నారు. గ్రేడ్-ఏ ధాన్యానికి క్వింటాల్‌కు రూ.2,461, సాధారణ రకానికి రూ.2,441 మద్దతు ధరగా నిర్ణయించగా, ప్రభుత్వం గుర్తించిన ఏడు సన్న రకాలకు అదనంగా రూ.500 బోనస్ చెల్లించనున్నట్లు తెలిపారు.



రైతులు ధాన్యాన్ని శుభ్రపరిచి, ఎండబెట్టి, టోకెన్ ప్రకారం కేంద్రాలకు తీసుకురావాలని, తేమ 17 శాతానికి మించకూడదని సూచించారు. కొనుగోలు చేసిన ధాన్యానికి సంబంధించిన మద్దతు ధరను 48 గంటల్లో రైతుల ఖాతాల్లో జమ అయ్యేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. రబీ 2025-26 ధాన్యం కొనుగోలు కమిషన్ రూ.2.61 కోట్లు కేంద్రాల నిర్వాహకుల ఖాతాల్లో జమ చేయాలని ఆదేశించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ హరిప్రియ, సంబంధిత శాఖల అధికారులు, కేంద్రాల నిర్వాహకులు పాల్గొన్నారు.

# ఆర్టీసీ గుర్తింపు సంఘం ఎన్నికల్లో ఎఐటియూసి గెలుపు ఖాయం

- ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు పరమేశ్వరయ్య

**మల్దకల్, సెప్టెంబర్ 29 (జనంసాక్షి):** ఆర్టిసి గుర్తింపు కార్మిక సంఘం ఎన్నికల్లో కార్మిక వర్గానికి కట్టు బడి ఉన్న ఎఐటియూసి అనుబంధ ఆర్టిసి ఎంప్లాయిస్ యూనియన్ గెలుపు ఖాయమని ఎంప్లాయిస్ యూనియన్ గద్వాల డిపో అధ్యక్షులు గాల్ రెడ్డి,కార్యదర్శి గిరిరాజ్,ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు పరమేశ్వరయ్య ధీమా వ్యక్తం చేశారు.

ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు ఎస్. బాబు, ప్రధాన కార్యదర్శి ఈదురు వెంకన్న ఆధ్వర్యంలో గద్వాల డిపోలో అక్టోబర్




9న జరిగే ఎన్నికలలో బస్సు గుర్తుకు ఓటు వేసి 371 మంది ఓటర్లు అత్యధిక మెజారిటీతో గెలిపించాలని ఆయన కోరారు.

డిపో స్థాపించిన నాటి నుండి రెండు సంవత్సరాలకు ఒకసారి జరిగే ఎన్నికలలో నేటి వరకు ఒకసారి మినహా మిగతా ఎన్నికలలో ఎంప్లాయిస్ యూనియన్ కు గద్వాల ఆర్టీసీ డిపో కంచుకోటగా నిలిచిందని తెలిపారు.

కార్మికుల కష్టాలను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తూ వారి తరపున పోరాటం చేసే ఏకైక యూనియన్ ఎంప్లాయిస్ యూనియన్ అని అన్నారు. ఈసారి జరిగే ఎన్నికలలో కూడా ఎంప్లాయిస్ యూనియన్ అత్యధిక మెజారిటీతో గెలుస్తుందని గాల్ రెడ్డి,గిరిరాజ్, పరమేశ్వరయ్యలు ధీమ వ్యక్తం చేశారు.

# చైతన్య కళాశాల భూమిపై వివాదం



**మహమ్మదాబాద్, సెప్టెంబర్ 29 (జనంసాక్షి):** మహమ్మదాబాద్ మండలం నంచర్ల గ్రామంలోని చైతన్య కోఆపరేటివ్ జూనియర్ కళాశాల భవనం, ఖాళీ స్థలంపై వివాదం ముదురుతోంది. సొసైటీ ఆస్తిని అన్యాక్రాంతం చేసేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయని కొందరు గ్రామస్తులు ఆరోపిస్తుండగా, కబ్జా చేసే ఉద్దేశం తమకు లేదని లీజుదారుడు కే.ఎం. నారాయణ స్పష్టం చేశారు. 1989లో గ్రామస్తుల విరాళాలతో నిర్మించిన కళాశాల భవనం ప్రస్తుతం వినియోగంలో లేకపోవడంతో వివాదానికి కేంద్రంగా మారింది. 2024లో లీజు ప్రక్రియ చేపట్టడం, అనంతరం పత్రాలు, మోటేషన్ అంశాలు తెరపైకి రావడంతో గ్రామస్తులు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. హక్కుపత్రం కాకపోతే మోటేషన్ ఎందుకు చేశారంటూ ప్రశ్నిస్తున్నారు. విద్యుత్ కనెక్షన్, అనుమతుల కోసం సమర్పించిన పత్రాలు యాజమాన్య హక్కును కల్పించవని పంచాయతీ కార్యదర్శి చెప్పినట్లు వారు పేర్కొన్నారు.

**లీజుదారుడు లేకుండానే పంచాయతీలు...**



కళాశాల భవనం లీజుదారుడు, డైరెక్టర్లను సమావేశానికి పిలవకుండానే గ్రామంలో పంచాయతీలు నిర్వహించి నిర్ణయాలు తీసుకోవడంపై మరో వర్గం అభ్యంతరం వ్యక్తం చేస్తోంది. ఈ వ్యవహారంపై పోలీస్ స్టేషన్‌తో పాటు జిల్లా ప్రజావాణిలోనూ ఫిర్యాదులు చేసినట్లు గ్రామస్తులు తెలిపారు.

**కబ్జా ఉద్దేశం లేదు...**

చైతన్య కోఆపరేటివ్ భవనం లేదా స్థలాన్ని కబ్జా చేసే ఉద్దేశం తమకు లేదని కే.ఎం. నారాయణ తెలిపారు. పాఠశాల విద్యుత్ అనుమతులు, నిర్వహణ కోసం అవసరమైన డాక్యుమెంటేషన్ మాత్రమే చేపట్టామని చెప్పారు. రాజకీయ కక్షతో కొందరు తనపై దుష్ప్రచారం చేస్తున్నారని ఆరోపించారు.

**సమగ్ర విచారణకు డిమాండ్...**

లీజు పత్రాలు, సొసైటీ రికార్డులు, భూమి యాజమాన్య వివరాలు, గ్రామసభ తీర్మానం, మోటేషన్, విద్యుత్ అనుమతులకు సమర్పించిన పత్రాలను అధికారులు పరిశీలించాలని గ్రామస్తులు కోరుతున్నారు. అన్ని అంశాలపై సమగ్ర విచారణ జరిపితేనే వివాదానికి స్పష్టత వస్తుందని వారు పేర్కొన్నారు.

# అథ్లెటిక్స్‌లో గురుకుల విద్యార్థికి రజతం



**మక్తల్, సెప్టెంబర్ 29 (జనంసాక్షి):** హన్మకొండలో సెప్టెంబర్ 27న నిర్వహించిన రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో మక్తల్ మహాత్మా జ్యోతిబా పూలే బాలుర గురుకుల కళాశాల విద్యార్థి రవీందర్ రజత పతకం సాధించారు. దీంతో కళాశాలకు, మక్తల్ ప్రాంతానికి పేరు తీసుకొచ్చారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ రాములు, ఏటీపీ మహేష్ సత్యనారాయణ, ఉపాధ్యాయులు రవీందర్‌ను అభినందించారు. పీఈటీలు నవీన్, ఇబ్రహీం, కోచ్ జగదీష్ కృషిని ప్రశంసించారు. భవిష్యత్తులో జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించాలని ఆకాంక్షించారు.

# ఉప్పునుంతలలో జిల్లాస్థాయి చెస్ పోటీలు



**ఉప్పునుంతల, సెప్టెంబర్ 29 (జనంసాక్షి):** మండల కేంద్రంలోని పీఎం శ్రీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పాఠశాలల క్రీడా సమాఖ్య ఆధ్వర్యంలో 70వ జిల్లా స్థాయి చెస్ పోటీలు, ఎంపికలు నిర్వహించారు. సర్పంచ్ చింతగాళ్ల శ్రీనివాసులు పోటీలను ప్రారంభించారు. అండర్-14, అండర్-17 విభాగాల్లో జిల్లాలోని వివిధ పాఠశాలలకు చెందిన 285 మంది విద్యార్థులు పాల్గొన్నారు. చెస్‌తో మేధోశక్తి, ఏకాగ్రత పెరుగుతాయని సర్పంచ్ తెలిపారు. ఎంపికైన విద్యార్థులను రాష్ట్రస్థాయి పోటీలకు పంపనున్నట్లు హెచ్‌ఎం జటప్రోలు శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, పీఈటీలు పాల్గొన్నారు.

# విద్యార్థుల ఆధార్ ఎన్రోల్మెంట్ మెరుగుపడాలి: జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్

- ఆధార్ అప్డేట్‌ను నిబంధనల ప్రకారం చేయాలి
- విద్యార్థుల ఆధార్ నమోదుకు ప్రత్యేక శిబిరాల ఏర్పాటు



**గద్వాల నడిగడ్డ, సెప్టెంబర్ 29(జనంసాక్షి);** జిల్లాలో విద్యార్థుల ఆధార్ ఎన్రోల్మెంట్ మెరుగుపడాలని, ప్రత్యేక శిబిరాలను ఏర్పాటు చేసి ఆధార్ కార్డులను జారీ చేయాలని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ అన్నారు. మంగళవారం ఐడిఓసి వీడియో కాన్ఫరెన్స్ హాల్లో డిఎల్ఏఎంసి (డిస్టిక్ లెవెల్ ఆధార్ మానిటరింగ్ కమిటీ) సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కొంతమంది నకిలీ సర్టిఫికెట్స్‌తో పలు ప్రయోజనాలు పొందేందుకు ఆధార్ కార్డులలో ఇష్టానుసారం మార్పులు, చేర్పులు చేసుకుంటారని ఇలాంటి వాటికి చోటు లేకుండా నిబంధనల ప్రకారం ఆధార్ కార్డుల అప్డేట్ చేయాలన్నారు. విద్యా సంస్థలతో పాటు అంగన్వాడి కేంద్రాల్లోని పిల్లలందరికీ ఆధార్ కార్డులు ఉండాలన్నారు. ఇందుకోసం అన్ని మండలాల్లోని గ్రామ పంచాయతీలతోపాటు మున్సిపాలిటీలలో బాల ఆధార్ కేంద్రాలు, ఇతర ప్రత్యేక శిబిరాల నిర్వహణకు సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పని చేయాలన్నారు. జనన ధ్రువీకరణ పత్రాన్ని అనుసరించి ఆధార్ కార్డులో పుట్టిన తేదీ నమోదు చేయాలని, పేర్లు, చిరునామా, తదితర మార్పుకు నిబంధనలను అనుసరించి ముందుకెళ్లాలన్నారు. ఆధార్ ఎన్రోల్మెంట్ కిట్స్ కొరతను అధిగమించేందుకు తగు చర్యలు తీసుకోవాలని సూచించారు. దేశ పౌరుల గుర్తింపుకు ఆధార్ కార్డులకు ఎంతో ప్రాధాన్యత ఉన్నందున ఆధార్ కేంద్రాల నిర్వాహకులు, సంబంధిత అధికారులు నిబద్ధతతో పనిచేయాలని ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ఆదేశించారు. ఈ సమావేశంలో ఆర్డీవో శ్రీనివాసరావు, ట్రైనీ డిప్యూటీ కలెక్టర్లు మనోజ్ కుమార్ రెడ్డి, రాజ్ కుమార్, డిడబ్ల్యుఓ సునంద, డిఇఓ విజయలక్ష్మి, డిఎంహెచ్ఓ సంధ్య కిరణ్మయి, ఎల్డిఎం శ్రీనివాసరావు, డిఎల్పిఓ ప్రవీణ్ కుమార్ రెడ్డి, ఆధార్ స్టేట్ ప్రాజెక్టు మేనేజర్ నరేష్ చంద్ర, ఈడియం శివ, మున్సిపల్ కమిషనర్లు, ఇతర అధికారులు, ఆధార్ కేంద్రాల నిర్వాహకులు, తదితరులు పాల్గొన్నారు.

# బాల్య వివాహాల నిర్మూలనకు అవగాహన



**తెలకపల్లి, సెప్టెంబర్ 29 (జనంసాక్షి):** బాల్య వివాహాల నిర్మూలనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని తాళ్లపల్లి సర్పంచ్ పులిపాటి శ్రీనివాసులు పిలుపునిచ్చారు. గ్రామంలో 'బాల్య వివాహ రహిత భారతదేశాన్ని నిర్మిద్దాం' సందేశంతో వాల్ పోస్టర్లను విడుదల చేశారు. 18 ఏళ్లలోపు బాలికలకు, 21 ఏళ్లలోపు బాలురకు వివాహం చేయడం చట్టవిరుద్ధమని తెలిపారు. బాల్య వివాహాలను ప్రోత్సహించడం, నిర్వహించడం శిక్షార్హమైన నేరమని పేర్కొన్నారు. గ్రామంలోని దేవాలయాల్లో బాల్య వివాహాలు జరగకుండా చర్యలు తీసుకుంటామని చెప్పారు. బాల్య వివాహాలతో పిల్లల భవిష్యత్తు దెబ్బతింటుందని, నిర్మూలనకు గ్రామస్తులు సహకరించాలని కోరారు.

# నకిలీ విత్తనాలు విక్రయిస్తే కఠిన చర్యలు





**చిన్నంబావి, సెప్టెంబర్ 29 (జనంసాక్షి):** నకిలీ విత్తనాలు, ఎరువులు, పురుగుమందులు విక్రయిస్తే చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని మండల వ్యవసాయ అధికారి డాకేశ్వర్ గౌడ్ హెచ్చరించారు. మంగళవారం వెలగొండలో సీడ్, ఫర్టిలైజర్, పెస్టిసైడ్ దుకాణాలను తనిఖీ చేసి డీలర్లకు సూచనలు చేశారు. సీడ్ యాక్ట్, ఫర్టిలైజర్ కంట్రోల్ ఆర్డర్, ఇన్సెక్టిసైడ్ యాక్ట్ నిబంధనలు పాటించాలని తెలిపారు. స్టాక్ రిజిస్టర్లు, బిల్లులు సక్రమంగా నిర్వహించాలని, ఎంఆర్పీ కంటే అధిక ధరకు విక్రయించరాదన్నారు. కాలం చెల్లిన, నిషేధిత మందులు అమ్మకూడదని స్పష్టం చేశారు. ధరల పట్టిక, స్టాక్ బోర్డు ఏర్పాటు చేసి రైతులకు బిల్లులు ఇవ్వాలని సూచించారు. యూరియా, డీఏపీతో లింక్ ప్రొడక్టులు అంటగట్టి విక్రయిస్తే చర్యలు తప్పవన్నారు.

## కట్ట మైసమ్మ ఆలయ హుండీ
# ఆదాయం రూ.1.32 లక్షలు




**ఉప్పునుంతల, సెప్టెంబర్ 29 (జనంసాక్షి):** లతీపూర్ శివారులోని శ్రీశ్రీశ్రీ కట్ట మైసమ్మ ఆలయ హుండీ ఆదాయాన్ని సోమవారం లెక్కించారు. 98 రోజులకు గాను రూ.1,32,636 ఆదాయం వచ్చినట్లు ఆలయ వర్గాలు తెలిపాయి. ఇందులో నోట్ల రూపంలో రూ.1,07,700, చిల్లరగా రూ.24,936 సమకూరాయి. దేవాదాయ శాఖ పరిశీలకుడు టి.మదన్‌కుమార్ ఆధ్వర్యంలో లెక్కింపు చేపట్టారు. అనంతరం ఆదాయాన్ని అచ్చంపేట ఎస్‌బీఐలోని ఆలయ ఖాతాలో జమ చేశారు. కార్యక్రమంలో తహసీల్దార్, పోలీసు సిబ్బంది, ఆలయ పాలకమండలి చైర్మన్ ఎడ్ల నరేష్ యాదవ్, సభ్యులు, ఈవో, భక్తులు పాల్గొన్నారు.

# పీఏసీఎస్ అభివృద్ధికి కృషి



**వనపర్తి రూరల్, సెప్టెంబర్ 29 (జనంసాక్షి):** నాగవరం పీఏసీఎస్‌ను మరింత అభివృద్ధి చేస్తామని అధ్యక్షుడు మధుసూదన్‌రెడ్డి తెలిపారు. నాగవరం శివారులోని రైతు వేదికలో మంగళవారం నిర్వహించిన మహాజనసభలో ఇన్‌చార్జి సీఈఓ విజయ్‌కుమార్ సంఘం వార్షిక లావాదేవీలు, అభివృద్ధి పనుల వివరాలను వెల్లడించారు. కర్షక మిత్ర రుణాలు, స్వల్ప, దీర్ఘకాలిక రుణాలు, వరి ధాన్యం కొనుగోలు, ఎరువుల సరఫరాతో సంఘాన్ని బలోపేతం చేస్తున్నామని అధ్యక్షుడు తెలిపారు. పెండింగ్ రుణ దరఖాస్తులను త్వరలో పరిష్కరిస్తామన్నారు. అయితే రైతులు లేకుండా మహాజనసభ నిర్వహించడంపై కొందరు రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. రికార్డులను రైతుల సమక్షంలో చదివి వినిపించాల్సిందని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీఈఓ రవీందర్, సిబ్బంది పాల్గొన్నారు.

# తల్లిపై దాడి కేసులో ఏ1 రిమాండ్




**ఉప్పునుంతల, సెప్టెంబర్ 29 (జనంసాక్షి):** ఉప్పునుంతల మండలం లాతిపూర్ గ్రామంలో తల్లిపై దాడి చేసి గాయపరిచిన కేసులో నిందితుడు కదరి పర్వతాలను పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. ఈ ఘటన ఈ నెల 26న చోటుచేసుకుంది. బాధితురాలిపై దాడి చేసినట్లు అందిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ కేసులో ఏ1 నిందితుడిగా ఉన్న కదరి పర్వతాలు, తండ్రి లింగయ్య, లాతిపూర్ గ్రామానికి చెందిన వ్యక్తిని పోలీసులు అదుపులోకి తీసుకుని విచారణ అనంతరం అరెస్టు చేశారు. అనంతరం నిందితుడిని గౌరవ న్యాయస్థానం ముందు హాజరుపరచగా, న్యాయస్థానం రిమాండ్‌కు పంపించింది. ఈ కేసులో భారతీయ న్యాయ సంహిత-2023లోని 118(2), 115(2), 79, 352, 3(5) సెక్షన్ల కింద కేసు నమోదు చేసి, తదుపరి దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

# తప్పుడు జనన ధ్రువీకరణ పత్రంపై కేసు



**వీపనగండ్ల, సెప్టెంబర్ 30 (జనంసాక్షి):** తప్పుడు జనన ధ్రువీకరణ పత్రం పొందిన ఘటనపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై జె. నరేష్‌కుమార్ తెలిపారు. బావాయిపల్లికి చెందిన మావిళ్ల లక్ష్మి పేరుతో ఎలాంటి జనన నమోదు రికార్డు లేకపోయినా, వీపనగండ్ల పంచాయతీ నుంచి ధ్రువీకరణ పత్రం పొందినట్లు కార్యదర్శి రమేష్‌రెడ్డి ఫిర్యాదు చేశారు. యూబీడీ వెబ్‌సైట్ యూజర్‌నేమ్, పాస్‌వర్డ్‌ను దుర్వినియోగం చేసి ఇతరుల సహాయంతో పత్రం పొందినట్లు పేర్కొన్నారు. ఒంటరి మహిళా పెన్షన్ కోసం పత్రాన్ని ఉపయోగించేందుకు ప్రయత్నించినట్లు ఫిర్యాదులో తెలిపారు. కేసుపై దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

## గ్రాడ్యుయేట్ ఓటరు నమోదుకు నిరంజన్ రెడ్డి శ్రీకారం

**అర్హులైన ప్రతి గ్రాడ్యుయేట్ ఓటు నమోదు చేసుకోవాలి**





**వనపర్తి రూరల్, సెప్టెంబర్ 29 (జనంసాక్షి):** హైదరాబాద్ - రంగారెడ్డి -మహబూబ్‌నగర్ గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి ఓటరు నమోదు ప్రక్రియను మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి తన స్వగృహంలో మంగళవారం ప్రారంభించారు. తాను స్వయంగా గ్రాడ్యుయేట్ ఓటరుగా నమోదు చేసుకోవడంతో పాటు, పలువురికి ఓటరు నమోదు ప్రక్రియపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా నిరంజన్ రెడ్డి మాట్లాడుతూ.. ఓటరు నమోదు ప్రక్రియ అత్యంత కీలకమని, అర్హత ఉన్న ప్రతి గ్రాడ్యుయేట్ బాధ్యతగా ఓటు నమోదు చేసుకోవాలని సూచించారు. నవంబర్ 2023 వరకు గ్రాడ్యుయేషన్ పూర్తి చేసిన వారు అర్హులని తెలిపారు. ప్రజాస్వామ్య ప్రక్రియలో ఓటు హక్కు వినియోగం కీలకమని, గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో అర్హులైన వారు భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా నందిమల్ల అశోక్, కౌన్సిలర్ శ్రీకర్ గౌడ్, పలుస శంకర్ గౌడ్, వెంకట్ సాగర్, ఉంగ్లం తిరుమల్, సూర్యవంశం గిరి, జోహెబ్ హుస్సేన్ తదితరులు ఓటు నమోదు చేసుకున్నారు. కార్యక్రమంలో వాకిటి శ్రీధర్, కె.మాణిక్యం, ధర్మా నాయక్, మహేశ్వర్ రెడ్డి,దేవర్ల నరసింహ, నీలస్వామి, మంద రాము తదితరులు పాల్గొన్నారు.

# పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటరుగా నమోదు చేసుకోండి!

**ఫారం-18 దరఖాస్తుకు నవంబర్ 6 చివరి గడువు.. కలెక్టర్ ఆదర్శ్ సురభి**



**వనపర్తి, సెప్టెంబర్ 29 (జనంసాక్షి):** మహబూబ్‌నగర్-రంగారెడ్డి-హైదరాబాద్ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల కోసం కొత్త ఓటరు జాబితా రూపొందిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి తెలిపారు. అర్హులైన పట్టభద్రులు ఓటరుగా నమోదు చేసుకునేందుకు ఫారం-18 ద్వారా నవంబర్ 6వ తేదీలోగా ఆన్‌లైన్ లేదా ఆఫ్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. మంగళవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన ఓటరు జాబితా నోటిఫికేషన్‌ను విడుదల చేసి వివరాలు వెల్లడించారు.

నవంబర్ 1, 2026 నాటికి గత మూడేళ్లకు ముందే డిగ్రీ పూర్తి చేసిన వారు మాత్రమే ఓటరు నమోదుకు అర్హులని కలెక్టర్ స్పష్టం చేశారు. గతంలో ఓటరుగా నమోదై ఉన్నప్పటికీ, ఈ ఎన్నికల కోసం కొత్తగా దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుందన్నారు. దరఖాస్తుల పరిశీలనలో భాగంగా అధికారులు అభ్యర్థుల ఇళ్లకు వచ్చి చిరునామా ధ్రువీకరణ పత్రం, డిగ్రీ సర్టిఫికెట్‌ను పరిశీలిస్తారని తెలిపారు.

నవంబర్ 25న ముసాయిదా ఓటరు జాబితా విడుదల చేస్తామని, అదే రోజు నుంచి డిసెంబర్ 10 వరకు అభ్యంతరాలు స్వీకరిస్తామని వెల్లడించారు. డిసెంబర్ 25లోగా అభ్యంతరాలను పరిష్కరించి, డిసెంబర్ 31న తుది ఓటరు జాబితా ప్రకటిస్తామని వివరించారు.

అర్హులైన పట్టభద్రులు ఫారం-18 ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చని, ఆఫ్‌లైన్‌లో దరఖాస్తు చేసుకునేవారు సంబంధిత తహసీల్దార్ కార్యాలయంలో స్వయంగా లేదా పోస్టు ద్వారా గడువులోగా అందజేయాలని కలెక్టర్ సూచించారు. పట్టభద్రులందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని ఓటరుగా నమోదు చేసుకోవాలని కోరారు.

## నకిలీ విత్తనాలు రైతులకు విక్రయిస్తే కఠిన చర్యలు

- **జిల్లా వ్యవసాయ అధికారి యశ్వంతరావు**



**ఊరుకొండ, సెప్టెంబర్ 29 (జనంసాక్షి);** మండలంలోని అగ్రో రైతు సేవా కేంద్రాన్ని సోమవారం ఉదయం 10 గంటలకు జిల్లా వ్యవసాయ అధికారి యశ్వంత్ రావు ఆకస్మికంగా తనిఖీ చేశారు.

దుకాణంలోని ఎరువులు, విత్తనాలు, పురుగు మందుల నిల్వలను పరిశీలించారు. స్టాక్ బోర్డు, లైసెన్స్ డిస్ప్లే, గోదాం వివరాలను పరిశీలించి నిబంధనలు తప్పక పాటించాలని సూచించారు. వివో ఎస్ మెషీన్ స్టాక్‌కు, ఫిజికల్ స్టాక్ కు తేడా ఉందా లేదా అని చెక్ చేశారు.

ఎరువుల విక్రయాల్లో రైతులకు ఎలాంటి ఇబ్బందులు ఎదురుకాకుండా చూడాలని స్పష్టం చేశారు. నకిలీ ఎరువులు విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. రైతులకు అందించే బిల్‌బుక్‌ను పరిశీలించి వివరాలన్నీ సరిగా నమోదు చేయాలని సూచించారు. ఈ తనిఖీలో మండల వ్యవసాయ అధికారి దీప్తి, బొమ్మరాశిపల్లె ఏఈఓ ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

# రక్త నిల్వల్లో కొరత రాకుండా చర్యలు తీసుకోవాలి

- **రెడ్‌క్రాస్ నూతన కార్యవర్గానికి అదనపు కలెక్టర్ ఖీమ్యా నాయక్ సూచన**



**వనపర్తి, సెప్టెంబర్ 29 (జనంసాక్షి):** అత్యవసర పరిస్థితుల్లో ప్రాణాలు కాపాడే రక్తం వనపర్తి జిల్లా బ్లడ్ బ్యాంకులో ఎల్లప్పుడూ అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) ఎన్. ఖీమ్యా నాయక్ సూచించారు. ఇందుకోసం తరచూ రక్తదాన శిబిరాలు నిర్వహించాలని, జిల్లాలో రెడ్‌క్రాస్ సభ్యత్వాన్ని విస్తరించాలని కోరారు.

మంగళవారం కలెక్టరేట్‌లోని ఎన్ఐసీ హాల్‌లో ఎన్నికల అధికారి, డీపీఓ ఆధ్వర్యంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ భాస్కర్ నాయక్ సమక్షంలో వనపర్తి జిల్లా రెడ్‌క్రాస్ సొసైటీ నూతన కార్యవర్గ ఎన్నికలు నిర్వహించారు. 15 మంది సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అనంతరం ఎన్నికైన సభ్యులతో ఎన్నికల అధికారి ప్రమాణ స్వీకారం చేయించారు.

నూతన కార్యవర్గంలో రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా చైర్మన్‌గా అమరేందర్ రెడ్డి, వైస్ చైర్మన్‌గా ప్రియాంక, కోశాధికారిగా చిన్న గోవిందు విష్ణువర్ధన్, రాష్ట్ర మేనేజింగ్ కమిటీ సభ్యుడిగా ఎల్ల భాస్కర్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ నూతన కార్యవర్గ సభ్యులకు శుభాకాంక్షలు తెలిపారు. జిల్లాలో రెడ్‌క్రాస్ సేవలను విస్తరిస్తూ అంకిత భావంతో పనిచేయాలని సూచించారు. అత్యవసర సమయాల్లో రక్తం కొరత లేకుండా చూడటంతోపాటు, ప్రజల్లో రక్తదానంపై అవగాహన కల్పించాలని పేర్కొన్నారు. అధిక సంఖ్యలో ప్రజలను రెడ్‌క్రాస్ సభ్యులుగా చేర్చేందుకు కృషి చేయాలని కోరారు.

### ఇండియన్ బ్యాంక్‌లో

## గోల్డ్ లోన్ ఖాతాదారుల ఆందోళన



**కేటీదొడ్డి, సెప్టెంబర్ 29 (జనంసాక్షి):** వెంకటాపురం ఇండియన్ బ్యాంక్ సిబ్బంది తీరుపై గోల్డ్ లోన్ ఖాతాదారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. రుణం పూర్తిగా చెల్లించిన అనంతరం ఆభరణాలను తూకం వేయకుండానే ప్యాకెట్లలో అందజేస్తున్నారని ఆరోపిస్తున్నారు. బ్యాంకు నిబంధనల ప్రకారం ఖాతాదారుల సమక్షంలో బంగారాన్ని తూకం వేసి అప్పగించాల్సి ఉన్నా, ఇక్కడ అలా చేయడం లేదని వాపోయారు.

తూకంలో తేడాలు వస్తే బాధ్యత ఎవరిదని ప్రశ్నించారు. దీనిపై నిలదీస్తే సిబ్బంది స్పందన సరిగా లేదని ఆరోపించారు.

# ఇసుక అక్రమ రవాణాపై క్షేత్రస్థాయి తనిఖీలు





**మాగనూరు, సెప్టెంబర్ 29 (జనంసాక్షి):** ఇసుక అక్రమ రవాణాను అరికట్టేందుకు అధికారులు క్షేత్రస్థాయిలో తనిఖీలు చేపట్టారు. మాగనూరు పోలీస్‌స్టేషన్ పరిధిలోని వర్కూరు, వర్ద్‌వాట్, అమ్మపల్లి ప్రాంతాల్లోని ఇసుక రీచ్‌లను ఎస్సై అశోక్‌బాబు, రెవెన్యూ ఆర్ఐ సురేందర్, మైనింగ్ ఆర్ఐ రాజారెడ్డి సంయుక్తంగా పరిశీలించారు. ఇసుక తవ్వకం, నిల్వ, రవాణాకు సంబంధించిన అనుమతులు, రికార్డులు, సిబ్బంది వివరాలను తనిఖీ చేశారు. రీచ్‌ల వద్ద విధులు నిర్వహిస్తున్న జీపీఓలు, ఎస్ఆర్ఏలకు భద్రతా అంశాలపై సూచనలు చేశారు. అనుమతులు ఉన్న రీచ్‌ల నుంచే నిబంధనల ప్రకారం ఇసుక రవాణా చేయాలని, ప్రతి వాహనానికి పర్మిట్లు, సంబంధిత ధ్రువపత్రాలు పరిశీలించిన తర్వాతే అనుమతించాలని స్పష్టం చేశారు. పర్మిషన్ లేకుండా లేదా నిబంధనలకు విరుద్ధంగా ఇసుక తరలించే వాహనాలపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని సిబ్బందిని ఆదేశించారు.

అక్రమ రవాణా లేదా అనుమానాస్పద వాహనాలు గుర్తిస్తే వెంటనే పోలీస్, రెవెన్యూ, మైనింగ్ అధికారులకు సమాచారం ఇవ్వాలని సూచించారు. ప్రభుత్వ ఆదాయానికి నష్టం కలగడంతో పాటు పర్యావరణానికి హాని కలిగించే ఇసుక అక్రమ రవాణాను అరికట్టేందుకు నిరంతరం పర్యవేక్షణ కొనసాగిస్తామని అధికారులు తెలిపారు. ప్రజలు కూడా అక్రమ తవ్వకాలు, రవాణాపై అధికారులకు సమాచారం అందించాలని కోరారు. తనిఖీల్లో మూడు శాఖల సిబ్బంది పాల్గొన్నారు.

## వాలీబాల్‌లో జాజాపూర్ విద్యార్థుల ప్రతిభ

**నారాయణపేట, సెప్టెంబర్ 29 (జనంసాక్షి):** నారాయణపేట మినీ స్టేడియంలో నిర్వహించిన ఎస్‌జీఎఫ్ జిల్లా స్థాయి అండర్-14, అండర్-17 వాలీబాల్ పోటీల్లో జాజాపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు ఉమ్మడి జిల్లా స్థాయికి ఎంపికయ్యారు. అండర్-17 బాలుర విభాగంలో కాట్రె కిరణ్‌కుమార్, బాలికల్లో త్రివేణి, అండర్-14 బాలుర విభాగంలో నీలి సాయికిషోర్, బి.చరణ్ ఎంపికయ్యారు. ప్రధానోపాధ్యాయురాలు భారతి విద్యార్థులను అభినందించి, క్రీడలు శారీరక దృఢత్వం, క్రమశిక్షణకు దోహదపడతాయని తెలిపారు. ఉమ్మడి జిల్లా స్థాయిలోనూ రాణించి రాష్ట్ర స్థాయికి ఎంపిక కావాలని ఆకాంక్షించారు. సర్పంచ్ కే.సంగీత, ఉపసర్పంచ్ లక్ష్మణ్, ఉపాధ్యాయులు, పీడీ నర్సింలు అభినందించారు.



## అక్రమ రేషన్ బియ్యం పట్టివేత



**కేటీదొడ్డి, సెప్టెంబర్ 29(జనంసాక్షి):** మండల పరిధిలోని ఈర్లబండ గ్రామ శివారులో అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని పట్టుకొని కేసు నమోదు చేసినట్లు కేటీ దొడ్డి ఎస్ఐ పి. శ్రీనివాసులు తెలిపారు. **ఎస్ఐ కథనం ప్రకారం...** నీలహల్లి గ్రామానికి చెందిన కురువ వీరన్న మంగళవారం (29-09-2026) ఉదయం 6:15 గంటలకు తన బొలెరో వాహనంలో సుమారు 7 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని రాయిచూర్ (కర్ణాటక)కు అక్రమంగా తరలిస్తున్నాడు. పక్కా సమాచారంతో ఈర్లబండ వద్ద వాహనాన్ని తనిఖీ చేసి, బియ్యంతో పాటు వాహనాన్ని స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు. ఈ మేరకు నిందితుడిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

# ఎస్సీ, ఎస్టీల హక్కుల పరిరక్షణకు కృషి



ఎస్సీ, ఎస్టీల నిధులను వారి అభ్యున్నతికే వినియోగించాలని, ఇతర అవసరాలకు మళ్లిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అట్రాసిటీ కేసుల్లో బాధితులకు త్వరగా న్యాయం జరిగేలా ఫిర్యాదు అందిన వెంటనే కేసులు నమోదు చేయాలని పోలీసులకు సూచించారు. బెస్ట్ అవైలబుల్ స్కూల్ స్కీమ్‌కు రాష్ట్రవ్యాప్తంగా రూ.102 కోట్ల బకాయిలను అక్టోబర్‌లో విడుదల చేస్తామని ముఖ్యమంత్రి హామీ ఇచ్చారని తెలిపారు. పెండింగ్ స్కాలర్‌షిప్‌లు, కులాంతర వివాహాల ప్రోత్సాహకాలు తదితర సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని చెప్పారు. ఇమాంబాద్‌లో వినాయక చవితి సందర్భంగా భోజనాల వడ్డింపులో వివక్ష ఆరోపణలపై క్షేత్రస్థాయిలో పరిశీలిస్తానన్నారు.
జిల్లా కలెక్టర్ కె.హైమావతి మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తున్నామని తెలిపారు. సీపీ సాధన రష్మీ పెరుమాళ్ మాట్లాడుతూ అట్రాసిటీ కేసులను సీరియస్‌గా తీసుకుని 60 రోజుల్లో దర్యాప్తు పూర్తి చేస్తున్నామని చెప్పారు. పదవీకాలం ముగుస్తున్న సందర్భంగా కలెక్టర్ ఆధ్వర్యంలో కమిషన్ చైర్మన్, సభ్యులను అధికారులు సన్మానించారు. కార్యక్రమంలో జిల్లా అధికారులు, విజిలెన్స్ కమిటీ సభ్యులు, ఎస్సీ, ఎస్టీ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

# ఫసల్‌వాడి వద్ద ఘోర రోడ్డు ప్రమాదం

- **లారీని ఢీకొని డెలివరీ బాయ్ మృతి**

**సంగారెడ్డి బ్యూరో, సెప్టెంబర్ 29 (జనంసాక్షి):** సంగారెడ్డి మండలం ఫసల్‌వాడి గ్రామ శివారులో జాతీయ రహదారి-161పై మంగళవారం తెల్లవారుజామున జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో 21 ఏళ్ల యువకుడు మృతి చెందాడు. రోడ్డుపై అడ్డంగా పడివున్న కంటైనర్ లారీకి హెచ్చరిక సూచికలు ఏర్పాటు చేయకపోవడంతోనే ప్రమాదం జరిగినట్లు ప్రాథమికంగా తెలుస్తోంది.
చౌటకూర్ మండలం వెంకటకిష్టాపూర్‌కు చెందిన ఈర్ల అభినయ్ (21) సంగారెడ్డిలో ఫ్లిప్‌కార్ట్‌లో డెలివరీ బాయ్‌గా పనిచేస్తున్నాడు. మంగళవారం ఉదయం 5 గంటలకు తన ద్విచక్ర వాహనంపై విధులకు బయలుదేరాడు. ఈ క్రమంలో 5.30 గంటల సమయంలో ఫసల్‌వాడి శివారులో రోడ్డుపై అడ్డంగా పడివున్న కంటైనర్ లారీ నంబర్ జీజే 03 సి డబ్ల్యూ 8383 ను చీకటిలో గమనించక ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో అభినయ్ తల, ముఖం, ఎడమ చేతికి తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న కుటుంబ సభ్యులు ఘటనా స్థలానికి చేరుకోగా, అప్పటికే 108 అంబులెన్స్‌లో అతడిని సంగారెడ్డి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.






అయితే, ఆసుపత్రికి చేరుకునే సమయానికే అభినయ్ మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు.
మృతుడి తండ్రి ఈర్ల అంజనేయులు ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. రోడ్డుపై లారీని అడ్డంగా నిలిపి, ఎలాంటి హెచ్చరిక సూచికలు ఏర్పాటు చేయకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించిన డ్రైవర్‌పై వచ్చిన ఆరోపణలతో పాటు ప్రమాదానికి గల కారణాలపై దర్యాప్తు చేపట్టారు.

# బీజేపీ ట్రేడర్స్ సెల్ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా శ్రీనివాసులు

**వనపర్తి, సెప్టెంబర్ 29 (జనంసాక్షి):** భారతీయ జనతా పార్టీ (బిజెపి) తెలంగాణ ట్రేడర్స్ సెల్ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా (ఙ్ఘవ జుజ వీవఎవతీ) వనపర్తికి చెందిన బాశెట్టి శ్రీనివాసులు నియమితులయ్యారు. ఈ మేరకు బిజెపి ట్రేడ్ సెల్ రాష్ట్ర కన్వీనర్ డాక్టర్ పూప్పల శారద గారి నుంచి ఆయన నియామక పత్రాన్ని అందుకున్నారు.



ఈ సందర్భంగా బాశెట్టి శ్రీనివాసులు మాట్లాడుతూ... తనపై నమ్మకంతో ఈ బాధ్యతను అప్పగించిన పార్టీ రాష్ట్ర నాయకత్వానికి, ట్రేడ్ సెల్ రాష్ట్ర కన్వీనర్ డాక్టర్ పూప్పల శారద గారికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. వనపర్తి జిల్లాతో పాటు రాష్ట్రవ్యాప్తంగా వర్తకుల, వ్యాపారుల సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తానని, బిజెపి బలోపేతానికి శ్రమిస్తానని ఆయన పేర్కొన్నారు. శ్రీనివాసులు నియామకం పట్ల బిజెపి స్థానిక నాయకులు, ట్రేడర్స్ సెల్ ప్రతినిధులు, వర్తక సంఘాల నాయకులు హర్షం వ్యక్తం చేస్తూ ఆయనకు అధికార ప్రతినిధి నక్క మహేష్ పట్టణ అధ్యక్షులు బత్తిని మధుసూదన్ కొండోజ్ గోపీనాథ్ మైనార్టీ సెల్ కన్వీనర్ ఖలీల్ శుభాకాంక్షలు తెలిపారు.

# ఎరువుల విక్రయంలో ఉల్లంఘనలకు పాల్పడితే కఠిన చర్యలు

**మద్దూరు, సెప్టెంబర్ 29 (జనంసాక్షి):** ఎరువుల విక్రయంలో నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని మద్దూరు మండల వ్యవసాయ అధికారులు హెచ్చరించారు. వ్యవసాయ శాఖ డైరెక్టర్, హైదరాబాద్, జిల్లా వ్యవసాయ అధికారి, నారాయణపేట ఆదేశాల మేరకు మండల పరిధిలోని ఎరువుల దుకాణాలను తనిఖీ చేశారు.
ఈ సందర్భంగా ఎరువుల నిల్వలు, విక్రయ రికార్డులు, స్టాక్ రిజిస్టర్లు, బిల్లులు, ధరల ప్రదర్శన, ఎరువుల నాణ్యత తదితర అంశాలను పరిశీలించారు. ఎరువుల నియంత్రణ ఉత్తర్వులు-1985 ( ఎఫ్ సి ఓ-1985) నిబంధనల ప్రకారం నిర్ణీత ధరలకే ఎరువులు విక్రయించాలని, ప్రతి రైతుకు తప్పనిసరిగా బిల్లు అందించాలని డీలర్లకు సూచించారు.
ఎరువులతో పాటు ఇతర ఉత్పత్తులను బలవంతంగా విక్రయించడం, అధిక ధరలు వసూలు చేయడం, నాణ్యత లేని లేదా అనుమతులు లేని ఎరువులను విక్రయించడం వంటి ఉల్లంఘనలకు పాల్పడితే సంబంధిత నిబంధనల ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.
రైతులు ఎరువులను అధీకృత దుకాణాల్లోనే కొనుగోలు చేసి



తప్పనిసరిగా బిల్లు తీసుకోవాలని సూచించారు. ఎరువుల విక్రయంలో అక్రమాలు, అధిక ధరల వసూళ్లు గమనిస్తే వ్యవసాయ శాఖ అధికారులకు సమాచారం అందించాలని కోరారు. రైతులకు నాణ్యమైన ఎరువులు సకాలంలో అందేలా నిరంతరం తనిఖీలు కొనసాగిస్తామని తెలిపారు.

# మానవత్వం చాటిన కానిస్టేబుల్ అఫ్రోజ్

**చేర్యాల, సెప్టెంబర్ 29 (జనంసాక్షి):** రోడ్డుపై పడిపోయిన మొబైల్ ఫోన్‌ను యజమానికి అప్పగించి చేర్యాల పోలీస్ స్టేషన్ కానిస్టేబుల్ అఫ్రోజ్ మానవత్వాన్ని చాటుకున్నారు. వేచరేణి గ్రామానికి చెందిన నూనె నర్సింహులు మంగళవారం ఉదయం ట్రాక్టర్ నడుపుతూ వెళ్తుండగా తన మొబైల్ ఫోన్ రోడ్డుపై పడిపోయింది. అదే సమయంలో విధులకు వస్తున్న కానిస్టేబుల్ అఫ్రోజ్ రోడ్డుపై పడి ఉన్న ఫోన్‌ను గమనించి తీసుకుని పోలీస్ స్టేషన్‌కు తీసుకొచ్చారు. అనంతరం ఫోన్ యజమానిని గుర్తించి, స్టేషన్‌కు పిలిపించి అతనికి ఫోన్ అప్పగించారు. నిజాయితీగా వ్యవహరించిన కానిస్టేబుల్ అఫ్రోజ్‌ను చేర్యాల ఎస్ఐ గూడ అపూర్వరెడ్డి, పలువురు అభినందించారు.



# అర్ధరాత్రి కూల్చివేతలు నిలిపివేయాలి



**వనపర్తి బ్యూరో, సెప్టెంబర్ 29 (జనంసాక్షి):** జడ్చర్ల కావేరమ్మపేటలోని ఎంబీ మెడికల్ సెంటర్ ఆసుపత్రి, నివాస ఆస్తుల వద్ద చేపట్టిన కూల్చివేతలను నిలిపివేయాలని ఎంబీ ఒలీవ చర్చి చైర్మన్ పి.డి. సుకన్య డిమాండ్ చేశారు. అర్ధ రాత్రి బుల్డోజర్లతో ఆసుపత్రి ప్రాంగణంలోకి వచ్చి డాక్టర్ అనురాధ మార్గరెట్ కుటుంబాన్ని భయాందోళనకు గురి చేయడం దారుణమన్నారు.
ఆస్తి వివాదాన్ని చట్టపరంగా పరిష్కరించాలని, కుటుంబానికి రక్షణ కల్పించాలని కోరారు.

# ఉచిత కంటి శిబిరంలో 75 మందికి పరీక్షలు

**నాగర్‌కర్నూల్, సెప్టెంబర్ 29 (జనంసాక్షి):** జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో నాగర్ కర్నూల్ పాత కలెక్టరేట్‌లో నిర్వహించిన ఉచిత కంటి శిబిరంలో 75 మందికి పరీక్షలు చేశారు. వీరిలో కేటరాక్ట్‌తో బాధపడుతున్న 27 మందిని గుర్తించి ప్రత్యేక అంబులెన్స్‌లో లయన్ రాంరెడ్డి కంటి ఆసుపత్రికి ఆపరేషన్ల కోసం తరలించినట్లు ఆప్తలమిక్ అధికారి కొట్ర బాలాజీ తెలిపారు. రోగులకు మందులు, సూచనలు అందించారు. కంటి ఆరోగ్యానికి విటమిన్-ఏ అధికంగా ఉండే క్యారెట్, ఆకుకూరలు, చేపలు తీసుకోవాలని సూచించారు.



# ఉపకార వేతనాల దరఖాస్తులు ఆన్‌లైన్‌లో పూర్తి చేయాలి

**నారాయణపేట జిల్లా బ్యూరో, సెప్టెంబర్ 29 (జనంసాక్షి):** ఎస్సీ, బీసీ విద్యార్థుల ఉపకార వేతనాల దరఖాస్తులను ఆన్‌లైన్‌లో పూర్తి చేయాలని డీఈవో గోవిందరాజులు ప్రధానోపాధ్యాయులను ఆదేశించారు. 5 నుంచి 10వ తరగతి విద్యార్థుల దరఖాస్తుల్లో బయోమెట్రిక్ అథెంటికేషన్, ఆధార్ సీడింగ్ తప్పనిసరిగా పూర్తి చేయాలన్నారు. అర్హులైన విద్యార్థులు ఉపకార వేతనాలకు దూరం కాకుండా నిర్ణీత గడువులో ప్రక్రియ పూర్తి చేసి, దరఖాస్తులను సంబంధిత కార్యాలయాలకు పంపాలని సూచించారు. సమావేశంలో బీసీ సంక్షేమ అధికారి అబ్దుల్ ఖలీల్, హెచ్‌ఎంలు పాల్గొన్నారు.




# జిల్లాస్థాయి వాలీబాల్ జట్టుకు ఊరుకొండపేట విద్యార్థి ఎంపిక

- **అభినందించిన విద్యాధికారి అబ్దుల్ రహీం**



**ఊరుకొండ, సెప్టెంబర్ 29 (జనంసాక్షి):** నాగర్‌కర్నూల్ జిల్లా ఊరుకొండ మండలంలోని ఊరుకొండ పేట జడ్పీహెచ్‌ఎస్‌లో 10వ తరగతి చదువుతున్న విద్యార్థి ఎండీ సద్దాం జిల్లా స్థాయి వాలీబాల్ జట్టుకు ఎంపికైనట్లు పీఈటీ జగన్ తెలిపారు. ఎస్ జి ఎఫ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లా వాలీబాల్ ఎంపిక పోటీల్లో సద్దాం ప్రతిభ కనబర్చి జిల్లా జట్టుకు ఎంపికయ్యాడు.
ఈ సందర్భంగా పాఠశాల హెచ్‌ఎం ఎండీ రహీం, ఉపాధ్యాయులు విద్యార్థిని అభినందించారు. కష్టపడి ప్రాక్టీస్ చేసి రాష్ట్ర, జాతీయ స్థాయిలో రాణించాలని ఆకాంక్షించారు.

# జిల్లాస్థాయి పోటీల్లో మల్దకల్ విద్యార్థుల ప్రతిభ

**మల్దకల్, సెప్టెంబర్ 29 (జనంసాక్షి):** జిల్లాస్థాయి పీఎం శ్రీ పాఠశాలల పోటీల్లో మల్దకల్ పీఎం శ్రీ జెడ్పీహెచ్‌ఎస్ విద్యార్థులు ప్రతిభ చాటారు.
తెలంగాణ జానపద నృత్య విభాగంలో భూమిక, మౌనిక, శిరీష, మహిమ, లేఖన, అఫ్రీన్ ప్రథమ బహుమతి సాధించారు. స్టోరీ టెల్లింగ్‌లో కె.శర్మిల ద్వితీయ బహుమతి పొందింది.
విద్యార్థులను ఎంఈఓ జి.సురేష్, ఇన్‌చార్జి హెచ్‌ఎం రాజేశ్వర్‌రెడ్డి, ఉపాధ్యాయులు అభినందించారు.

